

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13 సంచిక: 7 హైదరాబాద్ 2013 అక్టోబరు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**









ఫైల్ ఫోటో - శంఖుస్థాపన రోజున భావూజీతో వైయస్ రావ్

## బాబా సందేశం

నిస్వార్థంగా, ప్రతిఫలాపేక్ష లేకుండా కర్మయోగాన్ని,
దైవ చింతన తప్ప మరొకటి లేని భక్తి యోగాన్ని సాధన చేయడం ద్వారా
మానవులకు భగవదైక్యం తప్పక లభిస్తుంది.

**-మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-27860079**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | ఎలిజెబెత్ పాటర్‌సన్ | 6-13 |
| 3. | మా మాటలు | 14-15 |
| 4. | ఆనందాశ్రమం | 16 |
| 5. | నాకు తెలిసిన మాస్టారు | 17-19 |
| 6. | లార్డ్ మెహెర్ | 20-26 |
| 7. | యువ సహవాస్ | 27-30 |
| 8. | ఉన్నతోన్నతుడు | 31-37 |
| 9. | ప్రార్థనలు | |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# తాడేపల్లిగూడెం కేంద్ర పున:ప్రారంభోత్సవము

తాడేపల్లిగూడెం కేంద్ర పున:ప్రారంభోత్సవము 2013 డిసెంబరు 7 తెల్లవారుఝామున 5 గంటలకు జరుపుతున్నట్లు కేంద్ర కార్యదర్శి శ్రీ వీర్నాయుడు (95420 90214) ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చేవారికి డిసెంబరు 4 సాయంత్రం నుండి తగిన భోజన–బస ఏర్పాట్లు చేశామని, విచ్చేసే బాబా ప్రేమికులు తమ వివరాలు ముందుగా తెలియజేయవల్సిందిగా శ్రీ నాయుడు కోరుతున్నారు.

# జొన్నాడలో అఖండ నామం

**2013 అక్టోబరు 29 నుండి 2014 ఫిబ్రవరి 25 వరకు**

అవతార్ మెహెర్‌బాబా 120వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తూర్పు గోదావరి జిల్లా, ఆలమూరు మండలం, జొన్నాడ గ్రామంలో గల అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో 120 రోజులు, అనగా 2013 అక్టోబరు 29 నుండి 2014 ఫిబ్రవరి 25 వరకు ఉదయం 6 నుండి సా. 6 వరకు, మరియు ఆఖరి ఏడు రోజులు 24 గంటలూ **అఖండ ఏకనామం** ఏర్పాటుచేసినట్లు కేంద్ర అధ్యక్షులు శ్రీ తాడి జగన్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానిస్తూ, విచ్చేసే బాబా ప్రేమికులందరికీ భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు శ్రీ తాడి రామమోహన్ రెడ్డి తెలిపారు. కాగా, బాబా ప్రేమికులు తమ రాక గురించి ముందుగా తెలియజేయవల్సిందిగా ఆయన కోరుతున్నారు. మరిన్ని వివరాలకు **77020 97886, 94417 10432** సంప్రదించవల్సింది.

# పాలకొండ బాబా సెంటర్

శ్రీకాకుళం జిల్లా పాలకొండ బాబా సెంటర్ 19వ వార్షికోత్సవం **2013 నవంబరు 17** ఉ. 9 నుండి నిర్వహిస్తున్నట్లు స్థానిక బాబా ప్రేమికులు శ్రీ గణపతి నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 25వ తేదీ లోగా మీకు అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492–42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు.

**మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**

# సంపాదకీయం వై. "యస్". రావు

**యాతం సుబ్రహ్మణ్యేశ్వర రావు** బాబాలో ఐక్యమయ్యారు. ఇది ఆయన పూర్తి పేరు. ఐతే క్లుప్తంగా వై.యస్.రావుగానే బాబా ప్రేమిక కుటుంబంలోని ఆబాలగోపాలనికీ ఆయన సుపరిచితులు. మెహెరాబాద్‌లో అక్టోబరు 14, సోమవారం, విజయదశమి పండుగ ఘడియలు ముగిసేలోపు, అర్థరాత్రి 12 గంటల సమయంలో అందరూ ఆదమరచి నిద్రపోతున్న వేళ బాబా నామం స్మరిస్తూ ఆయన శాశ్వతంగా నిద్రలోకి జారుకున్నారు. నమ్మలేని ఈ నిజం తెల్లారేసరికి బాబా ప్రేమికుల్ని హతాశుల్ని చేసింది. ఆరోగ్యంగా, ధృఢంగా, బలిష్టంగా కనిపించే ఐదున్నర అడుగుల రావు గారు అకస్మాత్తుగా తుదిశ్వాస విడిచారంటే నమ్మశక్యం కాని విషయం. గత దశాబ్దం పైగా ప్రతినెలా 15 రోజులు మెహెరాబాద్‌లో, మిగిలిన పక్షంలో మెహెర్‌స్థాన్-కొవ్వూరులకు ప్రయాణం చేస్తున్న రావు గారు ఈ విజయదశమి పండక్కి కొవ్వూరు వస్తున్నాని చెప్పి కూడా వెళ్ళలేదు. **మెహెరాబాద్‌లోనే తన తుదిశ్వాస వదిలారు. ఇది బాబా ప్రేమికులకెందరికో కానీ దొరకని సదవకాశం.**

మెహెర్‌బాబా తన పనిని నిర్వర్తించడం కోసం తనకుతానుగా కొందరిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకుంటారని అందరికీ తెలుసు. ఆ కోవకు చెందినవారిలో వై.యస్. రావు ముఖ్యులు. మెహెర్‌స్థాన్‌లో అనేక విశేష కార్యక్రమాల రూపకల్పనలో, వాటి నిర్వహణలో అలాగే అక్కడ రెండస్థుల ధర్మశాల నిర్మాణం పూర్తిచేయడంలో శ్రీ రావు గారి పాత్ర మరువలేనిది. కొవ్వూరులో బాబా కార్యక్రమాలు జోరందుకున్న సమయంలోనే మెహెరాబాద్‌లో బాబా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రికి పరిపాలనా అధికారిగా ట్రస్టు నియమించింది. తదాదిగా మెహెరాబాద్ నుండి స్వగ్రామం కొవ్వూరుకు తిరిగి మెహెరాబాద్‌కు రైల్వేవారి సీజన్ టికెట్ ఆయన కొనుక్కున్నాడని స్నేహితులు చమత్కరించేవారు. మెహెరాబాద్ ఆసుపత్రి అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తూనే మరో చెంప మెహెరాబాద్‌లో ఆంధ్రా గెస్టుహౌసు నిర్మాణం చేపట్టాడు. కేవలం 35 మంది కోసమని ప్రారంభించిన గెస్టుహౌసు నేడు 500 మందికి భోజన, బస ఏర్పాటుకు అంచలంచెలుగా ఆయన అభివృద్ధి చేశాడు. నేడు గెస్టు హౌసులో జీవిత సభ్యత్వం కావాలన్నవారిని కొంతకాలం వేచివుండాలని చెప్పే పరిస్థితికి తీసుకెళ్ళాడు శ్రీ రావు. ఇదంతా బాబా నా చేత చేయిస్తున్నాడని ముక్తసరిగా జవాబిచ్చే శ్రీ రావు ఇటీవల కాలంలో మెహెరాబాద్‌లో తానిక ఇమడలేనన్న భావాన్ని సన్నిహితులతో పలుమార్లు వెలిబుచ్చాడంటారు. స్థానిక పెద్దలు కల్పిస్తున్న అనేక అవరోధాలు ఆయన్ని కలవరపెట్టాయన్నది వారి అభిప్రాయం. వైయస్ రావు అన్నింటికీ **'యస్'** (68) చెప్పాడు. ముక్కుసూటి మనిషి. నిర్భీతిగా, నిక్కచ్చిగా, నిజాయితీగా ఏ పనినైనా చేసేవాడు.

**స్థానికులు, సమకాలీనులు ఎంతమంది ఎన్ని విధాల వ్యతిరేకరించినా,**
**యుగావతారుని మెప్పు పొందిన ధన్యుడు శ్రీ వైయస్ రావు.**

### తొలితరం పాశ్చాత్య బాబా ప్రేమికురాలు

# ఎలిజెబెత్ పాటర్‌సన్



**తొలితరం పాశ్చాత్య బాబా ప్రేమికురాలు ఎలిజెబెత్ పాటర్‌సన్.**
ఆమె మెహెర్‌బాబాను తొలిసారిగా 1932 మే 24న అమెరికాలో దర్శించుకుంది. ఆ తొలి దర్శనంలోనే మెహెర్‌బాబా తనకెంతో కాలంగా తెలుసు అనే భావం కల్గిందని ఆమె అంటుంది. అప్పటికే మెహెర్‌బాబా మౌనంగా వున్నారని ఆమెకి తెలుసు. "ఆ సమయంలో నేనూ మౌనంగానే వున్నాను. ఆయన్ని ఎక్కడ చూసానా? అని గుర్తుకు తెచ్చుకుంటూ నోట మాట రాకుండా నిశ్శబ్దంగా స్థాణువులా చాలాసేపు ఉండిపోయానని" ఆమె తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ చెబుతుంది. ఆమె అమెరికాలోని చికాగోలో జన్మించింది. ఆ దరిమిలా ఆమెకు ఐదేళ్ళ వయస్సులో న్యూయార్క్‌లో స్థిరపడ్డారు. ఆ పిదప **మహిళా ఇన్సూరెన్సు బ్రోకర్‌గా,** ఒక అరుదైన ఉద్యోగాన్ని సుమారు 30 సంవత్సరాలు విజయవంతంగా నిర్వహించింది. ఆమె భర్త కెన్నెత్ పాటర్‌సన్ గొప్ప పియానో వాయిద్య కళాకారుడు. సంపూర్ణంగా ప్రేమ మూర్తీభవించిన వనితగా, శాంతమూర్తిగా ప్రతీతి చెందిందామె. ఆమెను **దిల్ రూబా** అని బాబా పిలిచేవారు. ఎదుటవారి మనస్సులను ప్రేమతో దోచుకోగల మృదుస్వభావి ఎలిజెబెత్ అని అవతార్ మెహెర్‌బాబా ఆమెను

అభివర్ణించేవారు. అవతారునికి సంపూర్ణ విధేయురాలైన ప్రేమికులకు నిర్వచనంగా ఎలిజెబెత్ సాక్షిగా నిలుస్తుంది. మెహెర్‌బాబా జరిపిన **బ్లూ బస్ యాత్రకు** డ్రైవర్‌గా ఉన్నది ఈ స్త్రీ మూర్తే. అలాగే, అమెరికాలో బాబా కారుకు జరిగిన ఘోర ప్రమాద సమయంలో కూడా ఎలిజెబెత్ కారు డ్రైవర్‌గా ఉంది. నాసిక్ లోని మెహెర్‌బాబా ఆశ్రమంలో చాలా కాలం ఉందామె. అమెరికాలో సుమారు 500 ఎకరాలలో మెర్టిల్‌బీచ్‌లో బాబా సెంటర్ ఏర్పాటుకు తన యావదాస్థిని అర్పించిందామె. అనుక్షణం అవతారుని సేవలో, నామస్మరణలో గడిపిన ధన్యజీవి ఎలిజెబెత్ పాటర్‌సన్. 1930వ దశకంలో అవతారుడిని తొలిసారిగా దర్శించుకున్న ఎలిజెబెత్, 1980 డిసెంబరు 6న తన తనువు చాలించేవరకూ అవతారుని సేవకే ఎంతో విధేయతతో అంకితమయ్యింది. అనుక్షణం అవతారుని నామస్మరణలో గడుపుతూ, అవతారుని సేవలో ఆమె గడిపిన వైనాన్ని ఈ తరం యువత తప్పక తెలుసుకోవాలి.
అవతారునితో తన అనుభవాలను, అనుభూతులను ఎలిజెబెత్ పాటర్‌సన్ తన స్వీయరచనల ద్వారా పలు సందర్భాలలో ఎంతో వివరంగా తెలియజేశారు. ఆ వివరాలను మెహెర్‌బాబా పత్రిక పాఠకుల కోసం ప్రత్యేకంగా ఈ శీర్షికలో అందజేస్తున్నాం. ఇకపై ఆమె మాటల్లోనే దయచేసి పరిశీలించండి.

## ప్రథమంగా

నేను తొలిసారిగా 1932 మే 24న అమెరికాలో హడ్సన్ ప్రాంతంలో బాబాను దర్శించుకున్నాను. ఆ తొలి దర్శనంలోనే మెహెర్‌బాబా నాకెంతో కాలంగా తెలుసు అనే భావం కల్గింది. అప్పటికే మెహెర్‌బాబా మౌనంగా వున్నారని నాకు తెలుసు. ఆ సమయంలో నేనూ మౌనంగానే వున్నాను. ఆయన్ని ఎక్కడ చూసానా? అని గుర్తుకు తెచ్చుకుంటూ నోట మాట రాకుండా నిశ్శబ్దంగా స్థాణువులా చాలాసేపు ఉండిపోయాను. ఆ తర్వాత నెమ్మదిగా బాబాతోపాటు అందరితోపాటు నేనూ బయటకు వెళ్ళాను. ఆ ప్రాంతంలోనే వున్న పూలతోట దగ్గరకు చేరుకున్నాం. ఆ ఆరుబయట అందరూ తలా ఒకచోట తిరుగుతుండగా నేను మాత్రం బాబాకు సన్నిహితంగానే వున్నాను. దగ్గర్లోని పూలకుండీలోని పింక్ పువ్వు ఒకటి బాబా కోసి, నా చేతికి ఇచ్చారు. ఆ పువ్వుని బధ్రంగా దాచుకోమన్నారు బాబా. ఈ మాటల్ని బాబా నాకేసి చూస్తూ తన అక్షరఫలకంపై రాశారు. బాబాతోనే వున్న మండలి సభ్యుడు కాకాబారియా ఆ అక్షరాలు చదివి నాకు అర్థమయ్యేలా చెప్పాడు. అంతేకాదు, ఆ పువ్వును జాగ్రత్తగా దాచిపెట్టుకుని, బాబా ఎప్పుడు నాకిచ్చారో ఆ తేదీని గుర్తుపెట్టుకోమన్నారు.

ఆ తర్వాత అంతా అర్ధమౌతుందన్నారు. ఆ రోజు సాయంత్రం ఇంటికి వెళ్ళాక ఆ పింక్ ఫ్లవర్‌ని నా దగ్గరున్న బైబిల్ గ్రంథంలో దాచాను.
**ఆ పువ్వు క్రింద మెహెర్‌బాబా 1932 మే 24 అని రాసుకున్నాను.**
సుమారు రెండు దశాబ్దాల తర్వాత మెహెర్‌బాబా ఇచ్చిన పింక్ పువ్వు, నా బైబిల్‌లో రాసుకున్న తేదీ వివరాలు నా కంటతడిపెట్టించాయి.

**కారు ప్రమాదం**

**ఆ రోజు తారీఖు 1952 మే 24.**
అవతారుని జీవితచరిత్రలో అత్యంత ప్రధానమైన రోజు.
అమెరికా గడ్డపై అవతారుని రక్తంచిందించిన రోజు – 1952 మే 24.
అమెరికాలోని ఒక్లహోమా ప్రాంతంలో బాబా మండలి సభ్యులున్న కారును నేను డ్రైవ్ చేస్తున్నాను. ఒక్క క్షణంలో, కన్నుమూసి తెరిచేలోపల కారు ప్రమాదం జరిగిపోయింది. మాకు ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది.
**Para plegic driving** అతని కోసం ప్రత్యేకంగా కారు తయారుచేశారు.
ఆ కారును తొలిసారిగా అతను డ్రైవ్ చేసుకుంటూ మాకెదురు వచ్చాడు.
ఎదురుగా వస్తున్న ఆ కారును ఢీ కొనాలి. లేదా ప్రక్క నుండి తప్పించుకుని వెళ్దామంటే మా కారు తలక్రిందులయ్యే ప్రమాదం వుంది. ఏం చేయాలో పాలుపోని స్థితి.
అంతక్రితం కొన్ని నిముషాల క్రిందటనే నా ప్రక్క సీట్లో కూర్చున్న బాబా కారు స్టీరింగును తన చేయి జాపి పట్టుకున్నారు.
ఇదెందుకు సంకేతమో అర్ధమయ్యింది.
ఎదురుగా వచ్చే కారును ఢీ కొట్టడమే సరైన నిర్ణయమనిపించింది.
బాబా ప్రక్కనే వున్న ఒక మురికి కుంటలో పడిపోయారు.
ఆయనకు బలమైన గాయాలు తగిలాయి. మెహెరా, మెహ్రూలకూ గట్టి దెబ్బలు తగిలాయి. కారు స్టీరింగ్ నా ఛాతీలోకి గుచ్చుకుపోయింది.
నా రెండు చేతులూ, ప్రక్కటెముకలు విరిగిపోయాయి.
భుజం దగ్గర గట్టి గాయమయింది.
కార్లోని వాళ్ళనందర్నీ ఒక్లహోమా ప్రాంతంలోని ప్రేగ్ ఆసుపత్రిలో బాబాతో పాటు, మెహెరా, మెహ్రూ, అందరం చేరాం.
ఇరవై ఏళ్ళ క్రితం, **1932 మే 24న** అమెరికాలోని హడసన్ ప్రాంతంలో తొలిసారిగా నేను బాబాను దర్శించుకున్న రోజున బాబా నాకిచ్చిన పింక్ పువ్వు, ఆ పువ్వు క్రింద ఆ రోజు తేదీ, వగైరా వివరాలు జాగ్రత్తగా రాసి ఉంచిన విషయాలు గుర్తుకువచ్చాయి.
**ఈ ప్రమాదం 1952 మే 24న జరిగింది.**

ఈ ఘోర ప్రమాదంలో బాబా నాకు పునర్జన్మ ప్రసాదించారని అర్థమయ్యింది.

**1952 మే 18 నాటి మాట.**

మెహెర్‌బాబా మెర్టిల్ బీచ్‌లోనే వున్నారు.

ఆ రోజున బాబా ఎలిజిబెత్‌ని పిలిచి నన్ను "నా ఇన్సూరెన్సు కాగితాలు" ఎక్కడున్నాయని అడిగారు. వాటిని సిద్ధంగా ఉంచుకోమని హెచ్చరించారు.

ఆ కాగితాలను నీతోపాటు తీసుకురమ్మన్నారు. ఆనాడు నా దగ్గర ఐదు ఇన్సూరెన్సు పాలసీలున్నాయి. 1952 మే 24 ఒక్లహోమా దగ్గర జరిగిన ఘోర కారు ప్రమాదంలో ఈ ఇన్సూరెన్సు పాలసీలు ఆసుపత్రి ఖర్చులు భరించడానికి అక్కరకొచ్చాయి.

## ఆధ్యాత్మిక ప్రయాణం

అమెరికా పర్యటనలో బాబా తన కారును ఎలిజెబెత్‌నే ఎందుకు నడపమన్నారు? ఇదో ఆసక్తికర విషయం. ఎందరో పురుష బాబా ప్రేమికులు వుండగా, తన కారుని నడపటానికి ఆమెకే ఎందుకు అవకాశం ఇచ్చారు?

ఈ ప్రశ్నకు జవాబు లేకపోలేదు. ఇదొక ఆధ్యాత్మిక ప్రయాణం.

అవతారుని రక్తం అమెరికా క్షేత్రంలో చిందించాలని నిర్ణయించబడి వుంది.

అవతారుడు అందుకు అన్నివిధాలా ఎలిజెబెత్‌ను సిద్ధం చేశారని చెప్పాలి!!

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఫ్రాన్స్ దేశంలో ఆమె రెడ్‌క్రాస్ సొసైటీకి ఆంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసింది. ఆ రోజుల్లో యుద్ధ భూమిలోని క్షతగాత్రులెందర్నో యూరోపులోని ఆసుపత్రిలో చేర్పించిన అనుభవం ఆమెకుండింది.

అంతేనా, మన దేశంలో మస్తుల అన్వేషణలో భాగంగా మెహెర్‌బాబా తన మండలివారితో కల్సి బస్సు యాత్ర కొన్ని వేల మైళ్ళు జరిపారు.

ఈ ప్రయాణంలో బాబా వాడిన బస్సు బ్లూ రంగులో వుంటుంది కాబట్టి ఈ యాత్రను **'బ్లూ బస్సు యాత్ర'** అని బాబా ప్రేమికులు పిలుస్తారు.

నేడు ఈ బ్లూ బస్సు బాబా ప్రేమికుల దర్శనార్థం మెహెరాజాద్‌లో వుంచారు.

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో గల మెహెరాబాద్‌లో బాబా సమాధి దర్శనార్థం వెళ్ళినవారిని వారంలో ఒక ప్రత్యేకమైన రోజున మెహెర్‌బాబా నివసించిన ప్రాంతం మెహెరాజాద్‌కు తీసుకెళుతున్నారు. ప్రస్తుతం బ్లూ బస్‌ను మెహెరాజాద్‌లో సందర్శకులకు వీలుగా వుంచారు. మెహెరాజాద్‌కు తొలిసారిగా వెళ్ళేవారు ఈ బ్లూ బస్‌ను తప్పక దర్శించండి!! సుమారు 20 మందికిపైగా ప్రయాణించడానికి వీలుగాగల ఈ బ్లూ బస్‌లో ఆనాడు మెహెర్‌బాబాతో పాటు స్త్రీ - పురుష మండలి వారందరూ ప్రయాణించారు. వీరందరి లగేజి బస్సు టాపుపై వేసేవారు.

ఆ రోజుల్లో మన రోడ్లు ఎంత బాగా వుండేవో ఊహించుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది

కదా!! నేటికీ అనేక ప్రధాన రహదార్లకు మరమ్మత్తుల అవసరం వుంది.
ఆ గడ్డు రోజుల్లో బాబా తన మండలివారితో ప్రయాణించిన బ్లూ బస్‌ను
నడిపింది ఈ స్త్రీ మూర్తే!!
ఆశ్చర్యపోవద్దు!! ఎలాంటి ఒడుదుడుకులూ లేకుండా,
ఎంతో జాగ్రత్తగా ఎంతో ఓర్పుగా, నేర్పుగా ఆ బ్లూ బస్‌ను నడిపింది
ఈ పాశ్చాత్య వనితనే!
అందుకే ఎలిజెబెత్‌ను ఆనాటి శ్రీకృష్ణుడి రథసారథి పార్థునితో పోల్చుతారు.

## అతిశయమేముంది !!

ఇది అవతారుడు ఎలిజెబెత్‌కు ఇచ్చిన ఒక అరుదైన అవకాశం!!
ఎవరికైతే తన వాహనాన్ని నడిపే అవకాశం లభిస్తుందో వారి ఆధ్యాత్మిక ప్రగతికి, వారి జీవిత లక్ష్యసాధనకు తన సహాయం తప్పక లభిస్తుందని బాబా ఒక సందర్భంలో అమెరికాలో ఉండగానే చెప్పారు. ఆ మాదిరిగా ఎలిజెబెత్ ఎంతో భాగ్యశాలి.

**ఆంతరంగిక – మండలి సభ్యులు**

1933లో తొలిసారిగా తన స్నేహితురాలు నోరినా మచెబెల్లీతో కలిసి నాసిక్‌లోని మెహెర్ ఆశ్రమంలో ఆమె చాలా రోజులున్నారు.
ఎలిజెబెత్ – నోరినా ఇద్దరూ ప్రాణ స్నేహితులు.
వీరిద్దరూ గత కొన్ని జన్మలుగా కలిసే జన్మిస్తున్నారని అవతారుని ఉవాచ.
వీరిద్దరిదీ జన్మజన్మల బంధం అన్నారు బాబా.
వీరి అవ్యాజ్య ప్రేమానురాగాలు అభివర్ణించలేమన్నారు.
అలాగే వీరిరువురు కూడా ఎన్నో జన్మలుగా అవతారునితో అనుబంధం కలిగివున్నారని, అవతారుని ఆంతరంగిక – మండలి సభ్యులుగా ఉన్నారని బాబా అన్నారు.

## మరో అరుదైన అవకాశం

మెహెర్‌బాబా ఆమెకు మరో అరుదైన అవకాశాన్ని ఇచ్చారు.
అదేమంటే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గల పంచగని గుహలో
బాబా 1929 ప్రాంతంలో ఏకాంతవాసం వున్నారు.
పశ్చిమ కనుమల్లో సముద్రమట్టానికి సుమారు 5 వేల అడుగుల ఎత్తులో టైగర్ వ్యాలీ ప్రాంతంలో ఈ గుహ వుంది. గుహ చుట్టూతా పెద్ద అడవి.
సింహాలు – పులులు సంచరించే ప్రాంతమిది.
అలాంటి పంచగని గుహలో 12 గంటలపాటు ఏకాంతంగా ఉండేదుకు ఎలిజెబెత్‌కు బాబా అనుమతించారు. 1938 మే 6 సాయంత్రం 6 నుండి ఆ మర్నాడు ఉదయం 6 దాకా ఆమె ఆ గుహలో ఏకాంతవాసం వుంది.

ఆ రోజు రాత్రి నిద్రపోకుండా మెళుకువగా వుండమని హెచ్చరిస్తూ అవతారుడే స్వయంగా ఆమెను గుహ లోపల వుంచి బయట నుండి తాళం వేశారు. ఈ సమయంలో తానెన్నో అద్భుత అనుభూతుల్ని చవిచూసానంటుంది ఆమె. అంతక్రితం వరకూ పంచగని గుహలో ఏకాంతవాసం చేసే అవకాశం బాబా తన ప్రేమికులైన బెహ్రాం, ప్లీడర్‌లకు మాత్రమే ఇచ్చారు.

**మరో అద్భుతం**

**అదేమంటే ఇది 1932 నాటి మాట.**

బాబా అమెరికా పర్యటనలో ఉన్న సమయమది.
ఎలిజెబెత్ నోరినాలను బాబా తనతోపాటు రైలులో ప్రయాణించమన్నారు.
బాబాను కలుసుకునేందుకై ఎలిజెబెత్ నోరినాలు తాముండే ప్రాంతం నుండి కారులో బయలుదేరారు. సగం దారిలో, అడవిలాంటి ప్రదేశంలో వీరి కారు దారి తప్పింది. ఎటు వెళ్ళాలో తెలియక ఇబ్బంది పడుతున్న సమయంలో ఒక వ్యక్తి ఎదురుబడి, తాను దారి చూపిస్తానని, తన కారుని అనుసరించమని చెప్పాడు.
వీరు అలాగే చేశారు.
ఆ దరిమిలా ఆ ఆగంతుకునికి ధన్యవాదములు చెప్పాలని కారు ఆపి, దిగి చూస్తే, ఆలా వచ్చిన వ్యక్తి తిరిగి కనబడలేదు.
వీరు కనుక వారి ప్రయాణం ముందుకు అలాగే కొనసాగించి వుంటే, ఆ మార్గంలో ఒక నదిపై వున్న బ్రిడ్జి కొట్టుకుపోయిందని తెలిసింది.
ఆ పిదప వారిని రక్షించడానికి సరైన దారి చూపించడానికి బాబా తన దూత (అబ్దుల్లా) నౌకరిని ప్రత్యేకంగా పంపానని తన ప్రేమికులందరి ఎదుట చెప్పారు. ఆపదలో ఆదుకునే ఆర్తత్రాయ పరాయణుడు అవతార్ మెహెర్‌బాబా!!

## మెర్టిల్ బీచ్

1941 ప్రాంతంలో మన దేశంలోని బాబా ఆశ్రమం నుండి అమెరికా తిరిగి వెళ్ళిన ఎలిజెబెత్, నోరినాలు అమెరికాలో మెహెర్‌బాబా సెంటర్ నెలకొల్పడానికి తగిన స్థలాన్వేషణ ప్రారంభించారు.
అమెరికాలో బాబా సెంటర్ ఏర్పాటులో కొన్ని ప్రత్యేక నియమాలు బాబా ప్రకటించారు.

**"Gift from the heart"** .

అమెరికాలో అవతారుని ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయాలంటే అక్కడున్న ప్రేమికుల హృదయాల నుండి వచ్చే బహుమతి కావాలని బాబా ముందుగా హెచ్చరించారు. ఆ మేరకు సుమారు 2 సంవత్సరాలు పైగా తగిన స్థలం కోసం అన్వేషించి ఎలిజెబెత్



**'మెర్టిల్ బీచ్'** – సౌత్ కరోలినా రాష్ట్రంలో –సముద్రతీర సమీపంలో సుమారు 500 ఎకరాల స్థలంలో బాబా సెంటర్‌ను నెలకొల్పింది.

ఈ స్థలాన్ని ఆమెకు – తన తండ్రి బహుమతిగా ఇచ్చారు. అనంతరం ప్రతి చిన్న విషయంలో బాబావారి అనుమతి తీసుకుని, ఆయన ఆదేశాల మేరకు మెర్టిల్ బీచ్ సెంటర్‌ను ఆమె ఏర్పాటు చేసింది. బాబా ఎడల ఆమెకు గల సంపూర్ణ విశ్వాసం, ప్రేమకు ప్రతీకగా ఈ సెంటర్ నేటికీ ఎందరికో స్వాగతం పలుకుతోంది. మెర్టిల్ బీచ్ సెంటర్ ఏర్పాటు గురించి ఆ కేంద్ర విశేషాలు తెలుసుకోవాలంటే అదొక ప్రత్యేక గ్రంధమౌతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే, బాబా ప్రేమికులందరికోసం ఎలిజెబెత్ ఈ కేంద్రాన్ని తన హృదయపూర్వక బహుమతిగా అందజేసింది!!

## మూగజీవుల పట్ల ప్రేమ

ఎలిజెబెత్ మూగజీవుల పట్ల ఎంతో ప్రేమగా వుండేది. మన దేశానికి అమెరికా నుండి బాబా దర్శనార్థం వస్తూ కూడా తనతోపాటు, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తన పెంపెడు శునకాలను ఆమె తీసుకువచ్చేది. వాటికేమైనా బాధ కల్గితే తాను విపరీతమైన బాధననుభవించేది!!

1939 మే 5న బాబాతో ఆమె జబల్‌పూర్‌లో వున్నారు. అప్పట్లో ఆమె దగ్గర వున్న 'కిప్పీ' అనే శునకానికి

**మే 5న** పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపిందామె. ఆమె దగ్గర "**ఫౌండీ**" అనే జాగిలం కూడా ఉండేది. మనదేశంలో ఉండగానే ఎవరో ఆ శునకాన్ని రోడ్డుపైనే వదిలేసి వెళ్ళిపోతే, దాన్ని ఆమె చేరదీసింది. ఆ శునకం ఆశ్రమంలో ఉంచేందుకు కూడా బాబా అనుమతి తీసుకుంది. దానికి **ఫౌండీ** అని బాబా నామకరణం చేశారు. ఆమె 1941లో ఆ కుక్కను తనతోపాటు అమెరికా తీసుకెళ్ళింది. తిరిగి 1946లో తనతోపాటు మన దేశానికి వస్తూ బాబావారి ఆశ్రమానికి తీసుకొచ్చింది. 1948 జనవరిలో ఒకరోజున ఎలిజెబెత్ ఏడుస్తూ, విచారంగా ఉండటం చూసి ఏమయ్యిందని బాబా వాకబు చేశారు. **'ఫౌండీ'** చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతోందని, అందుకే ఏడుపువస్తోందని ఆమె బాబాకు చెప్పింది. ఓ అలాగా! బెంగపడొద్దని బాబా భరోసా ఇస్తూ, **మహాత్మా గాంధీ కంటే మరో రెండ్రోజులు ఎక్కువ రోజులే ఫౌండీ** బ్రతుకుతుందని బాబా ఆమెను ఓదార్చారు. ఇది జరిగిన మర్నాడే ఢిల్లీలో గాంధీజీని హత్యచేశారు. ఆ దరిమిలా సరిగ్గా రెండ్రోజులకు ఫౌండీ కూడా తనువు చాలించింది!! మెహెర్‌బాబా ఆశ్రమంలో వుండే రోజుల్లో అక్కడున్న జంతువులన్నీ ఎలిజెబెత్ పర్యవేక్షణలోనే వుండేవి!!

## మెహెర్‌బాబా జర్నల్

ఆమెకు మూగజీవులపై మక్కువ మాత్రమే కాదు - ఆమెకు సాహిత్యంపై కూడా ఎంతో ఇష్టం వుండేది. ఆమె బాబా ఆశ్రమంలో వుండే రోజుల్లో - మెహెర్‌బాబా జర్నల్‌కు సంపాదకురాలిగా వుండేది.
ఆ పత్రికలో ప్రతినెలా బాబాచేత ఒక ప్రవచనం రాయించి, ప్రచురించిందామె. ఆ మాదిరిగానే ఈనాడు మనందరికీ అవతారుని ప్రవచనాలు గ్రంథం రూపంలో లభిస్తోంది!! ఆనాడు మెహెర్‌బాబా జర్నల్‌లో ప్రప్రథమంగా 'అవతార్' అనే అంశంపై బాబావారి ప్రవచనాన్ని ప్రచురించారు.

## బాబాలో ఐక్యం

ఈ మాదిరిగా అహర్నిశం అవతారుని సేవకే అంకితమైన ఎలిజెబెత్ 84 సంవత్సరాల వయస్సులో 1980 డిసెంబరు 6న మెర్టిల్ బీచ్‌లో స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస వదిలింది. అనంతరం ఆమె అస్థికతలను మెహెరాబాద్‌కు తీసుకొచ్చి, మెహెర్‌బాబా పాదాల చెంత వుంచారు. ఆమె సమాధిపై **ELIZABETH IS WITH BABA** రాసి వుంటుంది. బాబా తల్లితండ్రుల ప్రక్కనే వుండే ఈమె సమాధిని ఈ దఫా మెహెరాబాద్ పర్యటనలో తప్పక సందర్శించండి !!!

# నరసరావుపేట బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా నరసరావుపేట సెంటర్ నందు 10.08.2013 శనివారము బాబావారి విగ్రహావిష్కరణ 18వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ కార్యక్రమములో శ్రీ ప్రసన్న కుమార్ (విజయవాడ), శ్రీ కనకయ్య (గుంటూరు), పద్మనాభ రెడ్డి (అద్దంకి) పాల్గొని బాబావారి ప్రేమ సందేశాలపై ప్రసంగించారు.

12.08.2013 సోమవారము స్థానిక పాతూరు శివాలయం వీధిలో గల శ్రీ గురుశెట్టి శ్రీనివాసరావు గృహములో ఉ. 7.00 గంటల నుండి రాత్రి 7.00 గంటల వరకు బాబావారి అఖండ నామ అర్ధ ఏకాహ మహోత్సవము కడు వైభవంగా జరిగింది.

అలాగే, 15.08.2013 ఉ. 7.00 నుండి రాత్రి 7 వరకు సెంటర్ హాలు నందు బాబావారి అఖండ మౌన నామ జపం జరిగిందని కార్యదర్శి శ్రీ కె. కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# పావగడ బాబా సెంటర్

మా సెంటరు వ్యవస్థాపకులు శ్రీ రాజా నాయుడు గారి 3వ వర్ధంతి (19.09.2013) సందర్భంగా, మరియు 22.09.2013 న ఉ. 7 గంటల నుండి సా. 7 గంటల వరకు మెహెర్‌బాబా అఖండ నామము చాలా అద్భుతముగా జరిగినది. ఈ కార్యక్రమములో ధర్మవరము ప్రేమికులు పాల్గొన్నారు. నామము తర్వాత 3 సూఫీ పాటలను 5 మంది బాబా ప్రేమికులు చక్కగా గానము చేసారు. పావగడ మరియు ధర్మవరము ప్రేమికులు కలసి పాడారు. ఆ పాటల యొక్క అర్థమును హరిప్రసాద్ ఏలిజి చాలా చక్కగా వివరించినట్లు శ్రీ యు. నాగభూషణరావు, కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# విజయవాడ బాబా సెంటర్

మెహెర్‌బాబా ఉన్నతోన్నతుడనని 1953 సెప్టెంబరు 7, డెహ్రాడూన్‌లో ప్రకటించిన సందర్భంగా విజయవాడ బాబా సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడమైంది.

శ్రీమతి జి. సుబ్బలక్ష్మి అవతారుని సందేశంపై ప్రసంగించారు. సెప్టెంబరు 13, 14 తేదీలలో శ్రీ కర్పూరపు సుబ్రహ్మణ్యం ఇంటి నందు, అలాగే స్థానిక విజయవాడ వస్త్రలత వినాయక చవితి పందిరినందు, ప్రత్యేక కార్యక్రమములు నిర్వహించడమైంది.

# పుస్తక సమీక్ష

అవతార్ మెహెర్‌బాబాకు సంబంధించి విడుదలైన క్రొత్త పుస్తకాలు, సి.డిలను తగిన పుస్తక సమీక్ష నిమిత్తం ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక, హైదరాబాద్, చిరునామాకు ప్రతినెలా 5వ తేదీలోగా అందునట్లు పంపవల్సింది.

# దర్బారు ఫోటో

అవతార్ మెహెర్‌బాబా దర్బారు ఫోజు 6×4 సైజు గల ఫోటో విజయవాడ సెంటర్‌లో బాబా ప్రేమికులకు అందుబాటులో ఉంచినట్లు, కావల్సినవారు శ్రీ టి. మెహెర్ కుమార్ (92464 51979) సంప్రదించవలసినదిగా కార్యదర్శి శ్రీ ఎన్. శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

# బేరిపురిలో బాబా సత్సంగ్

శ్రీ అక్కినపల్లి రాజయ్య, (బేరి పురి గ్రామం, సారంగపూర్ మండలం, కరీంనగర్ జిల్లా) గారి ఇంట్లో 2013 సెప్టెంబరు 22న మెహెర్‌బాబావారి సత్సంగ్ ఘనంగా జరిగింది. పలువురు బాబా ప్రేమికులు లక్సెట్టిపేట, వెంకట్రావ్‌పేట, తదితర ప్రాంతాల నుండి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బాబా ప్రేమికులు శ్రీ తోట కొమరయ్య, శ్రీ తిప్పని బ్రహ్మయ్య అవతార్ మెహెర్‌బాబా ప్రవచనాలు, సందేశాలపై ఉపన్యసించారు. చక్కని సత్సంగ్ కార్యక్రమం వారి ఆధ్వర్యంలో జరిగింది.

# శ్రీకాకుళం బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్ర 52వ వార్షికోత్సవం సందర్భంగా 03.08.2013 ఉచిత నేత్ర శిబిరం డా॥ పి.ఎల్.ఎస్. రాజు , డా॥ కె.ఎల్. నాయుడు సౌజన్యంతో 120 మందికి నేత్ర పరీక్షలు జరిపి 30 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయడమైనది.

శ్రీకాకుళం కేంద్ర వార్షికోత్సవం 18.08.2013 బాబావారి కేంద్రంలో ప్రేమిక సహవాస్ కడు రమ్యంగా జరిగినది. ఉ. 5 నుండి నగర సంకీర్తనతో ప్రారంభమైంది. డా॥ బి.వి.ఎస్.వి.వరప్రసాద్, ఎండి, హోమియో వైద్య నిపుణులు సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. శ్రీ వి. శ్రీకుమార్ సప్తవర్ణ పతాక విశిష్టత గూర్చి తెలియజేశారు. అనంతరం మెహెర్ ప్రేమిక సహవాస్ నిర్వహింపబడినది. శ్రీ కె. వెంకటరావు, విశాఖపట్నం, డా॥ కె. అమ్మన్నాయుడు, శ్రీ యు.వి. రమణమూర్తి, శ్రీ పి. బాస్కరరావు తదితరులు పాల్గొన్నారని **కేంద్ర అధ్యక్షులు, శ్రీ బరాటం నాగభూషణరావు** ఒక ప్రకటనలో తెలిపారు.

# బాబాలో ఐక్యం

శ్రీ ఎ.వి. రత్నం, రాజమండ్రి గారి భార్య శ్రీమతి సత్యవతి 28.08.2013న సా. 5.30 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లో బాబాలో ఐక్యమయ్యారని ఆమె కుమార్తె శ్రీమతి తెన్నేటి రమ తెలిపారు.

# ఆనందాశ్రమంలో బాబా 48 గం. ఏకాహం



కేరళ రాష్ట్రంలో ఉన్న ఆనందాశ్రమం గురించి మీరెప్పుడైనా విన్నారా? లేదంటే ఇదిలో క్లుప్తంగా ఆ వివరాలు అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఆలకించండి. ఇదొక విశ్వశాంతిని ఆకాంక్షించే సెంటర్. నిరంతరం 365 రోజులూ భగవన్నామం జరుగుతూ ఉంటుందిక్కడ. మీకిష్టమైన భగవంతుని నామం స్మరించవచ్చు. అవతార్ మెహెర్‌బాబా, ఉపాసనీ మహారాజ్, బాబాజాన్, గోదావరి మాయి తదితరుల చిత్రపటాలు అనేక దేవతామూర్తుల సరసన ఇక్కడవారు ఉంచారని ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన మిత్ర ద్వయం శ్రీ పండుగ రమణ, శ్రీ కొల్లి రామారావులు తెలిపారు. ఇక్కడ అవతార్ మెహెర్‌బాబా ఏకనామం 48 గంటల పాటు 2013 అక్టోబరు 9వ తేదీ 9 గంటల నుండి 10 వ తేదీ 9 గంటల దాకా నిర్విరామంగా నిర్వహించారు. హిందూపురం బాబా ప్రేమికులు శ్రీ శివప్రసాద్, శ్రీ రాం కుమార్, మదన్ గోపాల్, కదిరి సెంటర్ ఆధ్వర్యంలో సుమారు 115 మంది బాబా ప్రేమికులు ఆనందాశ్రమంలో బాబా ఏకనామం నిర్వహించారు. హైదరాబాద్ నుండి సత్తయ్య, రామచందర్, (రామాయంపేట), కరీంనగర్ నుండి లక్ష్మణ్, శ్రీకాకుళం నుండి ప్రకాశ్ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అవతారుని ఏకాహం జరుగుతుంటే స్థానిక కేరళీయులు చాలామంది పాల్గొన్నారు. మెహెర్‌బాబా సందేశాన్ని ప్రతి ఏడాది ఒక రోజున వారి ఆశ్రమ మాస పత్రికలో ప్రచురిస్తున్నారని శ్రీ శివప్రసాద్ తెలిపారు. సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందాశ్రమం ఉంది. బాబా ప్రేమికులు తప్పక ఈ ప్రాంతాన్ని సందర్శించి కొన్ని క్షణాలు బాబా నామజపం ఇక్కడ నిర్వహించాలనుకోవడం హర్షణీయమని శ్రీ శివప్రసాద్ అన్నారు. కేరళ రాష్ట్రంలోని కన్‌హద్ గ్రామంలో ఈ ఆశ్రమం ఉంది. మంగుళూరు నుండి 60 కిమీ దూరం. ఒక గంట ప్రయాణం. ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు శ్రీ పండుగ రమణ (90009 46485) సంప్రదించగలరు.

# నాకు తెలిసిన మాస్టారు



మెహెర్ చరిత్రలో తమకంటూ ఓ పదిలమైన స్థానం సంపాదించుకున్న వై.ఎస్.రావ్ మాస్టారు ధన్యజీవి. ఒకసారి ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెడితే, జీవితాంతం ఉపాధ్యాయుడిగానే వ్యవహరిస్తాడన్న నానుడికి ప్రత్యక్ష నిదర్శనం ఆయన. వృత్తి ధర్మం నేర్పిన వ్యవహార దక్షత, తాను ఎన్నుకొన్న లక్ష్యాన్ని ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిబ్బరంగా నిలబడి సాధించే శక్తి రావు గారిని పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దాయి. విద్యార్థి దశలోనే గోదావరి గట్టున, బాబావారి ప్రేమికి పాత్రులు కావడం, బాబావారి ఆదేశం మేరకి నాగపూర్‌లో ఉన్నత విద్య నభ్యసించడం యాదృచ్ఛికం కాదు. మెహెరుని ప్రణాళికలో అవి అంతర్భాగం. అందువల్లనే సంవత్సరం పొడవునా ప్రేమ యాత్రికులకి చక్కని బస సమకూర్చాలన్న ఆలోచన వచ్చింది.

ఎందరు ఎంతగా విమర్శనాస్త్రాలు సంధించినా తొణక లేదు.

అవరోధాలు ఎన్ని ఎదురయినా కృంగి పోలేదు. ఆ నిర్భీతి ప్రభువు కృప వల్లనే.

ఇలనాటి ఘటోత్కచుడు మీరు. సమాధిలో కూర్చొన్న కృష్ణుడి మాటలకి కార్యరూపం ఇవ్వగలుగుతున్నారు అనేవాడిని. ఈ మధ్యన ఏడాది – రెండేళ్ళుగా సాధక బాధకాలు ఎక్కువైతే, **"మీ కృష్ణుడికి చెప్పండి",** అనేవాడిని. "అదే చేస్తున్నాను", అనేవాడాయన. ఇది కొత్త కాదు రావ్ గారికి. ఉపాధ్యాయుడిగా ఎన్నోసార్లు బదిలీలు వచ్చాయి. బదిలీ ఆర్డరు వచ్చిన ప్రతిసారీ ఏరుచ్ గారు అడ్డం నిలబడేవారు. అదొక అదృష్టం. అందరికీ దొరకని అనుభవం. బాబా భౌతిక శరీరం వదిలిన తొలినాళ్ళలో సమాధి దగ్గర రావ్ గారి చెప్పులు పోయాయి. ఏరుచ్ వెంటనే పెద్ద ఆదీకి కబురు పంపారు.

"నీ చెప్పుల జత ఒకటి పట్టుకురా" అని. అవి రాగానే, "ఇవి వేసుకో, చెప్పులు లేకుండా నడవకు" అన్నారు ఏరుచ్ గారు. మౌనమూర్తి మాటలకి భాష్యం చెప్పిన ఏరుచ్, ఆదీల చలువ వల్లనే కొవ్వూరు, వేగేశ్వరపురాల నివాసి, మెహెరాబాద్‌వాసి కాగలిగాడు. రోజూ ఇంట పూసిన గులాబీలని ప్రభువుకి సమర్పించ గలిగాడు. ఓ చిన్న సంచితో పూలు

తెచ్చి, సమాధి దర్శనానికి నిలబడిన అందరికీ ఇచ్చేవాడు. "మీరు పూలు పెట్టరుగా, మీకు ఇవ్వనులెండని నవ్వుతూ నన్ను దాటి ముందుకెళ్ళేవాడు. రోజూ నన్ను అలా దాటి వెడుతున్నా ఇంత త్వరగా నన్ను దాటి సమాధీయునిలో లీనమవుతాడని ఊహించలేదు ఎప్పుడూ. ఎందుకంటే మాస్టారిది మాట మాత్రమే కరుకు. మనస్సు వెన్న.

ఆయనకు మించిన దొడ్డ ఇల్లాలు శ్యామల గారు. దు:ఖాన్ని ద్రిగమింగి నిబ్బరంగా నడిచే శక్తిని ఆమెకు ప్రసాదించమని ప్రభువుకి విన్నపం చేస్తున్నా.

రావ్ - శ్యామల దంపతులని తెలుగువారు, ప్రేమికలోకం మరచిపోలేరు.

మాజేటి రామమోహన్‌రావ్-చింతా సర్వారావుల ద్వయం సమాధి దగ్గర చీకటిని పోగొట్టి 1969లో అందరి మన్ననకీ పాత్రులయ్యారు

ఆ ఒరవడిలోనే నడిచారు మన మాస్టారు.

ఆయన వెంట కదిలారు శ్యామల గారు. మెహెరాబాద్, మెహెర్‌స్థాన్‌లో మున్ముందు ఎన్నో అతిథి గృహాలు వస్తాయి. అప్పుడే చాలామంది స్థలాన్వేషణలో పడ్డారు కూడా. వారందరికీ మార్గదర్శకులు మాస్టారు దంపతులు.

**అందరూ వాస్కోడిగామాలు కాలేరు. సరికదా, వాస్కోడిగామాలని వెనక్కి లాగుతారు. చరిత్ర వాళ్ళని పట్టించుకోదు నిస్సందేహంగా.**

## విజయవాడ సెంటర్ నూతన కార్యవర్గ సభ్యులు(2013-15)

శ్రీ డాక్టర్ ఇ.ఎస్. ప్రభాకర్, ప్రెసిడెంట్, శ్రీ ఎస్. రాధాకృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎన్.బి.ఎస్.ఎస్.వి.జి. శర్మ, సెక్రటరీ,శ్రీమతి జి. సుబ్బలక్ష్మి, జాయింట్ సెక్రటరీ, శ్రీ పి.సిహెచ్. వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ, శ్రీ టి. మెహెర్ కుమార్, ట్రెజరర్ శ్రీ కె. సర్వారావ్, సబ్-ట్రెజరర్, శ్రీ యం.వి.వి. సుబ్బారావు, ఆడిటర్.

**ఇ.సి. మెంబర్లు** శ్రీ డాక్టర్ ఇ.ఎస్. మహేశ్వర్,శ్రీ వై. మెహెర్ కుమార్, శ్రీ జి. మెహెర్‌జీ, శ్రీ యం. వెంకటేశ్వరరావు, శ్రీ బి. లక్ష్మణ కుమార్, శ్రీ యం.ఎన్.డి.ఎస్.కె. వెంకటేశ్వరరావు, శ్రీ కె.వి.ఎస్. గుప్త, శ్రీ పి. మెహెర్ కుమార్, శ్రీ కె. హనుమాన్ బాబు, శ్రీ టి. ప్రసన్న కుమార్, శ్రీ డి. విజయ సారథి. **సలహా సభ్యులు** శ్రీ కె. హనుమంతరావు, శ్రీ సిహెచ్,టి.ఎస్.ఆర్.కె.పి.గుప్త, శ్రీ డి.వి. సుబ్బారావు, శ్రీ యం.జి.వి. ప్రసాద్, శ్రీ వి.యస్.ఆర్. మూర్తి, శ్రీమతి కె. రమాదేవి.

# డొనేషన్లు

హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ రామచంద్రరావు, రూ. 116,
డాక్టర్ జయసూర్య రూ 500 మెహెర్‌బాబా పత్రిక నిర్వహణలో భాగంగా 2013 అక్టోబరులో విరాళంగా అందజేశారు. జైబాబా.

# రాజాం కేంద్రం 27వ వార్షికోత్సవం



రాజాం అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 27వ వార్షికోత్సవం స్థానిక శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఉదయం 7 నుండి అవతార్ మెహెర్‌బాబా వారి చిత్రపటంతో రాజాం నగర పురవీధులలో ఊరేగింపు, అనంతరం రాజాం నగర పంచాయితీ కమీషనరు శ్రీ డి.శ్రీనివాసరావు గారిచే సప్తవర్ణపతాకావిష్కరణ గావింపబడింది. ఉదయం 9 నుండి 1.30 వరకు ప్రేమిక సహవాస్ శ్రీ ఆర్.బాణేశ్వరరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించడమైంది. ఈ కార్యక్రమములో శ్రీ బాలగోపాల మెహెర్ ఈశా ముఖ్యవక్తగా బాబావారి ప్రేమ సందేశాలను వివరించారు. ముఖ్య అతిధిగా శ్రీ బి.వి.రమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో శ్రీకాకుళం, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి, విశాఖపట్నం, పూతికపేట, పాలకొండ తదితర బాబా కేంద్రాల నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మెహెర్‌శ్రీ బృందం సంకీర్తన, గజల్సు మెహెర్ ప్రేమికులకు రజింపచేశాయని కార్యదర్శి **శ్రీ పి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.**

# వరుడు కావాలి

**వధువు పేరు–** పిల్లల మాధవి, **పుట్టిన తేది:** 29.08.1975, రంగు: ఎరుపు, **కులము:** కాపు, **ఎత్తు:** 5 అడుగుల 4 అంగుళాలు, **చదువు:** బి.ఎ, పి.జి.డి.ఎఫ్.టి. **మరిన్ని వివరాలకు** harish.pkmr@gmail.com సంప్రదించగలరు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-4 (1929 మే నుండి) - తెలుగుసేత:** *మల్లాది రామారావ్,*
**నూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

**ధు**లియాలో ఉన్న రెండు రోజులూ బాబావారు అనేక సంగతులు చెప్పారు.
ఈ సృష్టిలో ఎక్కడ చూసినా పరమానందం కన్పిస్తుంది.
పరమానందమన్నా, బ్రహ్మానందమన్నా పరమాత్మ రూపమే.
కానీ అజ్ఞానపు తెరలు కళ్ళకి కప్పటం వల్ల మనిషి పరమాత్మని చూడలేకపోతున్నాడన్నారు.
నిర్వికల్ప సమాధి అంటే ఏంటో వివరించారు.
ప్రార్ధన మనస్సుపెట్టి చేయాలి.
లేకపోతే ప్రార్ధన వల్ల ఒరిగేది ఏమీ లేదు, నోరు నెప్పి తప్ప అన్నారు.
భక్తి యోగాన్ని రెండు ముక్కల్లో తేల్చి చెప్పారు.
ఆధ్యాత్మిక మార్గంలో తొలి మెట్టు వైరాగ్యం అన్నారు.
సేవలో పరిపూర్ణతకి మార్గం చూపారు.
ఈ యావత్తు ప్రపంచం అనంత పరమానందంలో మునిగి తేలుతోంది.
కానీ మనిషికి ఆ బ్రహ్మానందం పట్టదు సరికదా క్షణిక సుఖభోగాల
కోసం వెంపర్లాడుతాడు. పేరు ప్రఖ్యాతల వెనక పరుగెడతాడు.
భోగభాగ్యాలు, పేరు, ఊరు అన్నీ క్షణికమైనవి.
అవొక భ్రాంతి. కానీ ఆ మాయలో కొట్టుకుపోతాడు మనిషి.
ఎందువల్లనా? అజ్ఞానం వల్ల.
అసలు సిసలు ఆనందం గురించి తెలియకపోవటం వల్ల.
ఇది తెలుసుకోవాలి మీరు. అప్పుడే సరైన మార్గంలో పడతారు.
బ్రహ్మానందం మీ సొత్తు అవుతుంది అని బాబావారు చెప్పారు.
మీ కళ్ళ ముందు కన్పిస్తున్న నా రూపం, నా అసలు రూపం కాదన్నారు.
అటువంటి భ్రాంతిలో పడవద్దన్నారు.
నేను ఐదు అడుగులు ఆరు అంగుళాలున్నాను.
అయితే ఇది నా అసలు రూపం కాదన్నారు.
తమ అసలు సిసలు రూపాన్ని చూడగలిగితే మీరు మీరులాగ వుండరన్నారు.

బ్రహ్మానంద స్వరూపడనని, సత్-చిత్ ఆనంద స్థితిలో ఎప్పుడూ వుంటాననీ అన్నారు.
అనంత శక్తి, అనంత జ్ఞానం, అనంత ఆనందం -
ఈ మూడు స్థితుల్లో ఏక కాలంలో వుంటాను.
కానీ ఆ స్థితి ఎలా వుంటుందో ఊహించలేరన్నారు.
మీది పరిమితమైన బుర్ర. దానికి అర్థం కాదు ఈ స్థితి.
సత్-చిత్-ఆనంద స్థితినే నిర్వికల్ప సమాధి అంటారు.
నిర్వికల్పమంటే **నేనే దేవ దేముడిని** అన్న స్థితి.
ఆ స్థితిలో పరమానందం తప్ప మరొకటి వుండదు.
అనంత చైతన్యం తప్ప మరొకటి వుండదు.
ఈ అహం బ్రహ్మాస్మి దశ ప్రతి ప్రాణి హక్కు.
ఆ స్థితికి ఎదగాలని ప్రతి ప్రాణి ప్రయత్నించాలి.
ఇదొక విధి. ఎంత కాలం ప్రయత్నించాలి. ఫలానా గడువులోపల
ఆ అనంత పరమానందపు అంచులకి ప్రతి ప్రాణి చేరతారని చెప్పలేము.
కొందరికి ఈ వేళ ఆత్మ సాక్షాత్కారం లభించవచ్చు.
ఇంకొందరికి రేపు సంప్రాప్తించవచ్చు. ఇంకొంత మందికి ఎన్నో జన్మలు ఎత్తాక
ఆ భాగ్యం దొరకవచ్చు. మరికొందరికి కళ్ళు కాయలు కాసేలోగానే ముక్తి లభించవచ్చు.
ఒక్కటి మాత్రం నిజం. సత్-చిత్-ఆనందం స్థితికి అందరూ చేరుతారు
ఏదో ఒక రోజున అని బాబావారు వివరించారు.
ఇంతలో ఎవరో సమాజసేవ గురించి ప్రస్తావించారు.
**నిస్వార్థంగా సేవ చేస్తే పరమాత్మని సేవించినట్లే కదా అని అడిగారు**.
సామాజిక సేవ మంచిదేనన్నారు బాబా.
దేశసేవ ప్రజాసేవ - రెండూ మంచివేనన్నారు.
ఇదే కర్మ యోగం అంటే నన్నారు.
ఈ కర్మ యోగం వల్ల కూడా ముక్తి దొరుకుతుంది అయితే ఓ పని చేయాలి.
అదేమిటి అంటే **నేనేదో చేస్తున్నానని** దేశసేవ ప్రజాసేవ చేయకూడదు.
ఈ పని నేను చేశాననీ విర్రవీగకూడదు. సేవ అంటే నిస్వార్థంగా చేసిందే సేవ.
ప్రతి ఫలాపేక్ష లేకుండా చేసిన సేవే నిజమైన సేవ.
నేనేదో చేస్తున్నాననుకుంటూ ప్రజాసేవ చేయకండి.
దేశసేవకి పూనుకోకండి. నేను చేస్తున్నాను నా పని నలుగురూ మెచ్చుకోవాలి
అని మీకనిపించిందో అహంకారం వస్తుంది. అతిశయం వస్తుంది.
ఈ అహంకారం, అతిశయం పుణ్యమా అని చెడ్డ సంస్కారాలు
మీలో గూడుకట్టుకొంటాయి. ఆ సంస్కారాలని తుడిచిపెట్టాలంటే

తల ప్రాణం తోకలోకి వస్తుంది.
ఏ దేశానికి వెళ్ళినా ఏదో ఒక సేవ చేస్తున్న వాళ్ళు కన్పిస్తారు.
కొందరు తమ దేశం కోసం పాటుపడ్తారు.
ఇంకొందరు తామున్న చుట్టుప్రక్కలకే తమ దృష్టిని కేంద్రీకరిస్తారు.
ఈ రెండు రకాల సేవల్లో మనకి స్వార్ధం కళ్ళకి కట్టినట్లు కనిపిస్తుంది.
అహంకారం తొంగిచూస్తుంది. ఆత్మస్తుతి కనిపిస్తుంది.
పేపర్లలో పేరు పడాలన్నది కొందరి తాపత్రయం.
పెద్దల జాబితాలో చేరాలని కొందరి తపన.
నలుగురి నోట తమ పేరు వినపడాలని ఇంకొందరు తెగ కొట్టుకుపోతారు.
తాము చేసిన ప్రతి పనికీ నలుగురూ జోహార్లు చెప్పాలని కళ్ళు కాయలు కాసుకొని ఎదురు చూస్తారు ఇంకొందరు.
పేరు ఊరు కోసం మేము ప్రాకులాడటం లేదు అంటూనే కొంతమంది, మంచివాళ్ళమన్న ముద్రకోసం కొట్టుకుపోతారు.
ఇలా చేసే సేవ కూడా సేవేనా! అది శుష్క దండగ పని.
అటువంటి సేవకి విలువలేదు, ప్రయోజనమూ లేదు అని బాబావారు స్పష్టం చేశారు.
కర్మ యోగం అంటే ఏమిటో వివరించారు.
నిస్వార్ధంగా చేసే సేవ నిజమైన కర్మయోగం అన్నారు.
ఏదో ఎవరినో ఉద్ధరిస్తున్నానన్న భావన ఆమడ దూరంలో పెట్టాలి.
దేవుని పేరిట మనస్సు పెట్టి నలుగురి కోసం పాటు పడాలి.
అదే నిజమైన సేవ. అదే భగవంతుని సన్నిధానం చేర్చే దివ్య మార్గం అన్నారు బాబా.
మరి భక్తి మార్గం సంగతి ఏమిటి?
**కర్మ యోగం కంటే భక్తి యోగం గొప్పది కాదా?** అని ఓ భక్తుడు అడిగాడు.
నీ మాట నిజమేనన్నారు బాబా.
ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళాలంటే కర్మ యోగం కంటే భక్తి యోగం మంచిదేనన్నారు. కర్మ యోగంతో పోలిస్తే, భక్తి యోగం సులువు కూడానన్నారు.
అయితే భక్తి యోగం మీరనుకొన్నంత సులువు కాదు.
గట్టి పట్టుదల కావాలి. ఎన్ని ఆటుపోటులు వచ్చినా చెక్కుచెదరకూడదు.
భగవత్ సాక్షాత్కారం కావాలి. అది దొరికే వరకూ వదిలేది లేదు అనుకోవాలి.
అదీ పట్టుదల అంటే. ఆ దీక్షకి భక్తితోడయితే ఇంక కావాల్సింది ఏముంటుంది.
మీ తపన ఫలిస్తుంది. కోరిక నెరవేరుతుంది.
కానీ ఓ సంగతి గుర్తుంచుకోండి.
భక్తితో ప్రార్థిస్తున్నాము కదా అని నాకది కావాలి.

మా ఆవిడకి ఇది కావాలి.
మా అబ్బాయికి డబ్బు దస్కం కావాలి.
ఓ దేముడా నా కోర్కె కాదనకు అని వేడుకొన్నారనుకోండి
మీ భక్తి బూడిదపాలేనన్నారు. ఆ భక్తికి అర్థం పర్థం వుండదన్నారు.
భక్తి ఎలా వుండాలో వివరించారు. భక్తి అంటే ఏమిటి? అది ఒక తపన.
దేని కోసం తపన. దేముడిని చూడాలని, పరమాత్మతో ఏకం కావాలని
మనసా వాచా పడే మథన.
రోజంతా పురాణాలు చదవడం భక్తి కాదు.
భగవన్నామ పారాయణం కూడా భక్తి కాదు.
పురాణ పఠనం, నామ జపం నలుగురి కోసం. నలుగురి మెప్పు కోసం.
అదొక దగా, మోసం.
అబ్బే ఇది భక్తి కాదు. ముక్తికి మార్గం కానేకాదు.
దేముడిపై మనస్సు పెట్టాలి.
ఇంకో ఇతర ఆలోచన దగ్గరకి రానీ కూడదు.
చుట్టుప్రక్కల ఏమి జరుగుతుందో పట్టించుకోకూడదు.
వాళ్ళేమయ్యారు, వీరేమవుతున్నారన్న ధ్యాస రాకూడదు.
అలా దృష్టి అంతా దేముడిపై పెట్టి, ఓ ఐదు నిముషాలు కూర్చొన్నా చాలు.
ఆలోచనలకి తాళం వేసి, భగవంతుడిపైనే మనస్సుని లగ్నం చేస్తే,
గురి కుదురుతుంది. ఎంతసేపంటే ఎంతోసేపు కాదు.
ఐదు అంటే ఐదు నిముషాలు చాలు రోజుకి గురి కుదురుతుంది.
ఒక్క రోజులో కాదు. క్రమ క్రమంగా మనస్సు భక్తితో నిండిపోతుంది.
ఆ భక్తి సాగరంలో ఈదుతూ దైవీప్రేమ పడవలో తేలతారు.
ఈ అదృష్టం చిటికెలో రాదు.
ఎంత గట్టిగా భగవంతుడిని ఆరాధిస్తారో, అంతగా భక్తి పెరుగుతుంది.
భక్తి పెరిగిన కొద్దీ భగవంతుడికి దగ్గరవుతారు.
భక్తి యోగంలో సాధకుడి దృష్టి భగవంతుడిపైనే వుండాలి.
ఏదీ పట్టించుకోకూడదు. ఈ నిరాసక్తత, నిర్లిప్తత, ఒక్క రోజులో రావు.
భక్తి మార్గంలో అగుడుపెట్టాక అవే వస్తాయి నెమ్మది పైన.
భగవత్ చింతనలో పడిన కొద్దీ ప్రాపంచిక వ్యవహారాలకి దూరం అవుతారు.
ఇదే భక్తి యోగానికీ, కర్మ యోగానికీ వున్న తేడా.
కర్మ యోగంలో దృష్టి ప్రాపంచిక వ్యవహారాలపైనే వుంటుంది.
ప్రజాసేవలో తరించాలని చూస్తున్నారు అంటే మీకు ప్రపంచంతో బంధం తెగటంలేదు

మరి భక్తి యోగంలో మీరేం చేస్తున్నారు.
ఈ ప్రాపంచిక బంధనాలని పట్టించుకోవటం లేదు సరికదా
పరాత్పర పరబ్రహ్మపైనే మీ దృష్టి అంతా!
మీ కేమీ పట్టదు ఆ భక్తి పారవశ్యంలో.
అవునా ఇదీ కర్మ, భక్తి యోగాల మధ్యన తేడా.
అయితే ఈ రెండింటినీ అంటే కర్మయోగం చేస్తూనే భక్తి యోగాన్ని పాటించగలిగితే,
భేషుగ్గా వుంటుంది. ఈ రెండు యోగాల సాధన నేను చెప్పినట్లు చేయాలి.
**నిస్వార్ధంగా, ప్రతిఫలాపేక్ష లేకుండా కర్మయోగాన్ని దైవ చింతన తప్ప మరొకటి లేని భక్తి యోగాన్ని సాధన చేయాలి. అలా చేస్తే, అదీ మనస్ఫూర్తిగా చేస్తే ముక్తి లభిస్తుంది అని బాబావారు ధులియా వాసులకి స్పష్టం చేశారు.**
ఓ పెద్ద మనిషికి కొత్త ధర్మ సందేహం వచ్చింది.
వెంటనే బాబావారికి చెప్పాడు.
ఏం చేయమంటావ్ బాబా అని అడిగాడు.
ఇంతకీ ఆ మహానుభావుడి ధర్మ సందేహం ఏమిటీ అంటారా పాఠకమహాశయా!
అయితే వినండి. అతనికి వచ్చిన సందేహం ఏమిటి అంటే,
ధ్యానానికి కూర్చొన్నప్పుడు ఎవరి నామజపం చేయాలి కొందరు
ఏమో "రామ" "రామ" అంటూ ధశరధ రాముడిని తలుచుకోమంటారు.
ఇంకొందరికి రామ నామం వద్దు. కృష్ణ నామామృతంలో తేలాలి అంటారు.
ఇంకొందరు అంటారు కదా రాముడు, కృష్ణుడు అని వద్దు.
నామ రూపాలకి అతీతుడు భగవంతుడు కాబట్టి నిర్గుణ స్వరూపమైన
"పరమాత్మ"గా దేముడిని ఊహించుకొని ధ్యానానికి కూర్చోవాలని అంటారు.
మరి మీరేమంటారు బాబా అని అడిగాడు.
అవతారపురుషుడు చిరునవ్వునవ్వాడు.
ఆ నవ్వులో ఎన్నో అర్ధాలు కనిపించాయి అక్కడివారికి.
మన అమాయకత్వం చూసి దేవదేవుడు నవ్వుకొంటున్నాడనుకొన్నారు కొందరు.
మనల్ని అమాయకులు అనుకోవటం లేదు.
మనల్ని పరమ మూర్ఖుల క్రింద జమచేసి,
పరబ్రహ్మ సమక్షంలో వుండి కూడా చొప్పదంటు ప్రశ్నలు వేస్తున్నారు
మీరని జాలి పడుతున్నారు బాబా అనుకొన్నారు ఇంకొందరు.
సకల చరాచర సృష్టి మనస్సు తెలిసిన జగధాభిరాముడు ఏమన్నారో తెలుసా?
ఏ పేరు అయితేనేం అన్నీ ఒక్కటే అన్నారు.
రాముడు, కృష్ణుడు, ఏసు, మహ్మదు, బుద్దుడు –

ఇలా ఏ నామ జపం చేసినా ఒక్కటే.
మీరు ఏ నామ స్మరణ చేశారన్నది కాదు ప్రధానం.
ఆ నామ జపం ఏ ప్రకారంగా చేసేరన్నది ప్రధానం.
రాముడిపైనో, కృష్ణుడిపైనో మరి ఇంకెవరిపైనో దృష్టి పెట్టాలనుకొని మీరేమి చేస్తారు.
ఆ రూపంలో భగవంతుడిని మనోఫలకంపై వుంచుతారు అవునా.
మరి దేముడి సంగతి ఏమిటి?
మీకు కావాల్సింది నామ జపమా?
భగవంతుడి నామస్మరణ చేస్తే సరిపోదు.
భక్తి కావాలి. ఆ భక్తి అటూ ఇటూ పరుగెత్త కూడదు.
దేముడిపైనే మనస్సు లగ్నం కావాలి లేకపోతే
రామ, రామ అంటూ ఓ పది పన్నెండేళ్ళు కూర్చొన్నా,
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లు వుండిపోతారు.
ఆధ్యాత్మికంగా ఎదగలేరు.
ధ్యానానికి కూర్చొన్నప్పుడు భగవంతుడిని ఏదో ఒక రూపంలో ఊహించుకోగలిగితే,
ధ్యానం తేలికవుతుంది. మనస్సుకి గురి ఎప్పుడు కుదుర్తుంది.
అవతారుడిదో సద్గురువుదో, ఎవరో ఒకరి రూపంపై దృష్టి పెట్టాలి.
రామ, రామ అంటూ చిలకపలుకుల్లా వల్లెవేస్తే,
అది చిలకపలుకే అవుతుంది తప్ప భగవన్నామ స్మరణ కాదు.
ఒకరోజు చేసినా పన్నెండేళ్ళు చేసినా ఆ నామస్మరణకి విలువ వుండదు.
కాబట్టి ధ్యానానికి కూర్చొన్నప్పుడు మనస్సుకి తాడేసి కట్టేయాలి.
మీకు గురువు వుంటే, ఆయన ప్రతిమనో, ఫోటోనో మీ ఎదురుగా పెట్టుకొని
ధ్యానానికి కూర్చోండి. ఇదే భేషైన పని అని బాబావారు శెలవిచ్చారు.
బాబావారి మాటలకు అందరూ బుర్ర వూపారు.
మీరు చెప్పింది బాగుంది కానీ, నా కష్టం మాటేమిటని అడిగాడు ఒకాయన.
ఆయనకి ఏకాగ్రత కుదరటంలేదట. ఆ మాటే చెప్పాడు.
ఏకాగ్రత కుదరాలి అని మీరన్నది నిజమే
కానీ బాబా నాకు ఏకాగ్రత కుదరటం లేదని వాపోయాడు.
ఏకాగ్రత కుదరాలని ఎంత ప్రయత్నించినా లాభం వుండటం లేదన్నాడు.
**నాకీ వరాన్ని ప్రసాదించు బాబా, ఇంకేమీ కోరను అని వేడుకొన్నాడు!!**
బాబావారు చిరునవ్వు నవ్వారు.
నవ్వులో ఎన్నో అర్థాలు కనిపించాయి.
నీకెందుకు చింత నేనుండగా నీచెంత అనిపించింది కొందరికి.

బాబావారు ఈమాటే శెలవిచ్చారు. బెంగపెట్టుకోకు, నేనున్నానుగా అన్నారు.
ధ్యానానికి కూర్చొన్నప్పుడు మనస్సుని నాపై లగ్నం చేయి.
నన్ను గుర్తు చేసుకో. నారూపం కనబడగానే నాపైనే ఏకాగ్రతపెట్టు.
అలా చేస్తే, నీకే చింతా అక్కర్లేదు. నేనుంటాను నీ చెంత.
నీకు ఏకాగ్రత కుదిరేలా నేను చేస్తాను అన్నారు. ఇంతలో ఇంకో పెద్దమనిషి వచ్చాడు బాబావారి దర్శనానికి.
బాగా చదువుకొన్న వ్యక్తిలా కన్పిస్తున్నాడు. ఆమటే చెప్పాడు.
నేను చాలా పురాణాలు చదివాను అన్నాడు. ఎందుకు చదివాడట అంటే తనకి దైవభక్తి ఎక్కువనీ ఆధ్యాత్మికోన్నతి కోసం తపిస్తున్నాననీ చెప్పాడు.
ఏదో పుస్తకాలు చదివితే నాకు తృప్తిగా లేదు. ఈ భవ బంధాలు త్రెంచుకోవాలని వుంది కానీ లైంగిక వాంఛలు వదలటంలేదు బాబా ఏం చేయమంటావ్.
నాకో తరుణోపాయం చెప్పు అని వేడుకొన్నాడు. వైరాగ్యం మంచిదేనన్నారు బాబా.
అన్ని బంధాలనీ త్రెంచుకోవాలన్న ఆలోచన వచ్చిందీ అంటే ఆధ్యాత్మిక బాటలో పడినట్లేనన్నారు. వైరాగ్యం నీవు అనుకొన్నంత తేలిక కాదు. చాలా కష్టం. మనస్సుని కుదురుగా పెట్టాలి. ఎందుకో తెలుసా? గందరగోళంగా వుందీ అంటే అది మనస్సు వల్లనే. మనస్సు పరిపరి విధాల పరుగెడుతూ వుంటుంది.
దాన్ని కట్టిపడేయాలి. మనోనాశ్‌ని కనుక సాధిస్తే, వైరాగ్యం దానంతట అదే పుట్టుకు వస్తుంది. కానీ చిక్కల్లా ఏమిటీ అంటే మనస్సుకి పని లేకుండా చేయటం వుందే అది ఆషామాషీ పనికాదు. అది ఎంతో కష్టమయిన పని అన్నారు.
హిమాలయ పర్వతాన్ని మోయటం ఎంత అన్నారు బాబా.
మరి ఏం చేయాలి నువ్వు? నువ్వు ఏమి చేయాలంటే దేముడిపై దృష్టిపెట్టు.
దైవారాధనలో కాలం గడుపు. దైవారాధన
తప్ప ఇంకేమీ పట్టకూడదు నీకు. బంధాలకీ, అనుబంధాలకీ దూరమయితేనే వైరాగ్యం వస్తుంది. నేను ఇది, నేను అది నాకు అది కావాలి. ఇది చేయాలి అన్న ఆలోచన మరచిపోవాలి. ఇలా ఎప్పుడు చేయగలుగుతావు? ఎప్పుడు చేస్తావంటే, మనసా, వాచా, కర్మణా భగవంతుడికే నువ్వు అంకితమయినప్పుడు. బంధాలకీ, అనుబంధాలకీ, రాగాలకీ, అనురాగాలకీ దూరం కాగలుగుతావు. అంతే వైరాగ్యం వస్తుంది. ఆధ్యాత్మికంగా ముందుకుపోతావు. ఇదేగా నువ్వు కోరుకుంటున్నది అని బాబావారు అడిగారు. అతగాడు ఇదే బాబా నేను కోరుకొంటున్నది. ఇంతకంటే నాకేమీ అక్కర్లేదు బాబా! మీ మాటలని పాటిస్తాను. నా జన్మ ధన్యమయిందీవాళ అని, బాబావారికి మరోసారి నమస్కరించి ఇంటి దారి పట్టాడు.

**–సశేషం**

# మెహెరాబాద్‌లో యువ సహవాస్

## 2013 ఆగస్టు 26 - సెప్టెంబరు 1

**(మెహెర్ శాండిల్య)**

మెహెరాబాద్ యంగ్ అడల్ట్స్ సహవాస్ గత 12 సంవత్సరాలుగా ప్రతి ఏటా మెహెరాబాద్‌లో బాబా ట్రస్టు నిర్వహిస్తోంది. ఈ సహవాస్ నేటి తరం యువతకు ప్రత్యేకం!! ఈ దఫా తెలుగువాళ్ళం మొత్తం పది మందిమి మాత్రమే ఈ సహవాస్‌కు హాజరయ్యాం. మనకంటే ఉత్తరాదివారు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని చెప్పాలి. అన్ని ప్రాంతాల నుండి కలిపి మొత్తం 100 మంది యువతీ-యువకులు హాజరయ్యారు. మాలో చాలామందిమి గత కొన్నేళ్ళుగా ఈ సహవాస్‌లో పాల్గొంటున్నాం. ఏతావాతా, ఈ సహవాస్‌లో పాల్గొనడం ద్వారా యువతకు బాబా ప్రేమలో తరించే ఓ అరుదైన అవకాశం లభిస్తుందని మా అభిప్రాయం. కాగా, ఈ సహవాస్‌లో పాల్గొన్న బాబా ప్రేమికులు శ్రీ దిగంబర్ గాడేకర్ ఈ సహవాస్‌ని **మెహెర్‌బాబా యంగ్ అడల్ట్స్ సహవాస్‌గా పిలిస్తే బాగుంటుందని సూచించారు.** ఇది సబబు కూడా. మెహెరాబాద్‌లో బాబా సమక్షంలో ఈ ఏడు రోజుల సహవాస్‌లో మేము గడిపిన ఆ మధురక్షణాలు నేటి తరం యువతకు తెలియజేద్దామన్న ఉద్దేశ్యంతో ఈ సహవాస్‌కు రాలేకపోయిన మాతోటి స్నేహితులందరి కోసమని ఆనాటి విశేషాలు రేఖామాత్రంగా మిత్రులకో లేఖలా రాస్తున్నాం. దయచేసి పరిశీలించండి!!

## మిత్రమా!!

**నిరంతరం బాబాను గుర్తుంచుకోవడం ఎలా?** అనేది ఈ ఏడాది యువ సహవాస్ ప్రధానాంశం. సహవాస్‌లోని ఏడు రోజులూ తెల్లవారుఝామున 5 నుండి రాత్రి 10 దాకా అనేక బాబా కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపాం. బాబా ప్రేమికులు ఆలీ రంజూ, ప్రతాప్ ఆహిర్, దిగంబర్ గాడేకర్, శ్రీమతి & శ్రీ గోకర్ణం శ్రీవాత్సవ ఇలా పలువురు బాబా ప్రేమికులు తమ చిన్నతనం నుండి మెహెర్‌బాబాతో గడిపిన మధుర క్షణాల్ని మాతో ముచ్చటించారు.నేడు ఆలీ రంజూ బాబా ట్రస్టు చైర్మన్ వ్యవహారాలు కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈయన బాబా మండలి సభ్యుడైన రంజూ గారి కొడుకు. తన చిన్నతనంలో బాబాతో గోలీలు ఆడుకున్నానని శ్రీ ఆలీ చెప్పారు. ఈ ఏడురోజులలో ఉదయాన్నే ఎగువ మెహెరాబాద్‌లో బాబా దర్శనం, అనంతరం బాబా సందేశాలపై పెద్దల ప్రసంగాలు, అనేక అంశాలపై చర్చా వేదికలు, గ్రూపులుగా వర్క్‌షాప్ సమావేశాలు నిర్వహించారు. ఒకరోజున పూనే పట్టణంలో గల బాబా సెంటర్, గురు ప్రసాద్, బాబాజాన్ సమాధి, బాబావారి ఇల్లు - తదితర ప్రదేశాలకు వెళ్ళాం.



మా వారంరోజుల సహవాస్ ముగింపులో అహ్మద్‌నగర్ బాబా సెంటర్‌కు, అనంతరం మెహెరాజాద్‌లకు వెళ్ళాం.

ఆగస్టు 27న ఒక ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. యువతలో నిమిడీకృత్తమైన శక్తిని వెలికితీసే ప్రయత్నమిది. సహవాస్‌కి హాజరయిన యువత అందరూ వారికి చేతనయిన పనిని చేసేలా పురమాయించారు. దాంతో మాలో కొందరు బాబాపై అద్భుతమైన పాటలు రాశారు. కొందరు ఆ పాటలకు సంగీతాన్ని సమకూర్చారు. కొందరు నృత్యం చేశారు. మరికొందరు బృందగానం, డాన్స్ డ్రామాలు, కవ్వాలీలు అల్లారు. నాటికలు ప్రదర్శించారు. మెహెర్ ప్రైమరీ లీగ్ పేరిట క్రికెట్ మ్యాచ్ ఆడాం. హైదరాబాదీ మెహెర్ కిరణ్ 'కప్' గెల్చుకున్నాడు. అలాగే మెహెర్ కిరణ్ **'మాన్ ఆఫ్ ది మ్యాచ్'** కూడా అయ్యాడు!! మాధురి (హైదరాబాద్) కోలాటం డాన్స్‌లో పాల్గొనింది. మెహెర్ క్రాంతి 'గిటార్'పై **ఐ లవ్ యు బాబా** ఆలాపించాడు. త్విషా మేస్త్రీ (గుజరాత్) అద్భుతమైన నృత్య ప్రదర్శన చేసింది. మెహెర్ కాంత్, మెహెర్ శ్యామ్‌లు (హైదరాబాద్) నాటిక ప్రదర్శనలో పాల్గొన్నారు. అలాగే పలు అంశాలపై **'చర్చా వేదికలు'** నిర్వహించారు. మొత్తం హాజరయిన యువతనందర్నీ ఏడు గ్రూపులు చేసి,

ఒక్కొక్క గ్రూపుకు వారు ఎంచుకున్న అంశంపై కూలంకషంగా చర్చించుకుని సహవాస్ చివరి రోజుకంటే ముందుగా ఒకరోజున బాబా ప్రేమికుల ఎదుట యువత ప్రసంగించే ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రూపుకు హెడ్‌గా బాబా ప్రేమికులు శామ్ కేరేవాలా, ప్రతాప్ ఆహిర్, అమ్రిత్, దారా, అన్నా ఖండాలే, ఆలీ రంజూ, శ్రీధర్ ఖేల్‌కర్, శ్రీమతి & శ్రీ గోకర్ణం శ్రీవాత్సవ్, దిగంబర్ గాడేకర్‌లున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు బాబా దర్శనం, ప్రార్ధనలు, ఆరతి కోసం ఎగువ మెహెరాబాద్‌కు చేరుకునేవాళ్ళం. ఒకరోజున ప్రత్యేక రీతిలో 'క్విజ్' ప్రోగ్రాం నిర్వహించారు. చాలా రసవత్తరంగా కొనసాగిందీ కార్యక్రమం.

మాకు తెలియని ఎన్నో బాబా విషయాలు క్విజ్ ద్వారా తెలుసుకునే అవకాశం లభించింది. ఆగస్టు 28 - శ్రీకృష్ణాష్టమి. ఆ రోజున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ఎగువ దిగువ మెహెరాబాద్‌లో వున్న అనేక ప్రదేశాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని మాకు అప్పగించారు. కొన్ని పాత భవనాలకు, ఎగువ - దిగువ మెహెరాబాద్ రహదారికి ప్రక్కనున్న రాళ్ళకు తెల్ల సున్నం వేశాం. మండలిహాలు, బాబా జోపిడి, టేబుల్ హౌసు, పిలిగ్రిం రిట్రీట్‌లలో పలు పరిశుభ్రం చేసే సేవా కార్యక్రమాలు చేశాం. ఆగస్టు 29న ఉ.8.30 కల్లా పూనే పట్టణానికి రెండు బస్సుల్లో వెళ్ళాం. పూనేలో పంప్‌కిన్ హౌసు, బాబావారి ఇల్లు, గురు ప్రసాద్, పూనే బాబా సెంటర్, బాబాజాన్ సమాధి, ఇతరత్రా చూపించి, వాటి విశేషాల గురించి ఎంతో చక్కగా దారా అమృత్‌లు, ప్రతాప్ ఆహిర్ తదితరులు చెప్పారు. ఆగస్టు 30న ఉదయాన్నే ఎగువ మెహెరాబాద్‌లో బాబా దర్శన కార్యక్రమం అయిపోయాక ఆ రోజున భావూజీని కలుసుకున్నాం. ఆయన ఎదుట భజన గీతాలు ఆలాపించే అవకాశం దొరికింది. గత కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యం అంత బాగా లేకున్నా, మమ్మల్ని చూడాలని, మాతో మాట్లాడ్డానికి భావూజీ ఎంతో ఇష్టపడ్డారని బాబా ప్రేమికులు చెప్పారు. ఆనాడు భావూజీ దిగువ మెహెరాబాద్‌లో ఎ-హాస్టల్ దగ్గర్లోనే వున్న కుమార్తె షీలా గారింట్లో వున్నారు. చక్రాల కుర్చీలో ఆయన కూర్చునుంటే ఆయన ఎదుట మేం బాబా నామం, భజనలు చేశాం. ఆయనెంతో సంబరపడ్డారు. మా పాటలకు అనుగుణంగా తన చేతివ్రేళ్ళతో తాళం వేశారు. ఆరోగ్యం బాగాలేదు కదా! ఎక్కువసేపు కూర్చోలేరేమోనని, ఇక విశ్రాంతి తీసుకోవల్సిందిగా కోరుతూ లోనికి వెళ్ళాలని స్థానికులు కొందరు చెప్పినా...ఫరవాలేదంటూ ఆయన మాతో నవ్వుతూ చాలాసేపు గడిపారు. భావూజీతో ఫోటోలు దిగాం!

**ఆదిసచేతన** ఆరతి ఆలాపించాం. మెహెర్‌నాథ్, షీలాజీలు బాబా సందేశాలు, బాబాతో వారి చిన్ననాటి అనుభూతులు మాతో పంచుకున్నారు.

ఆగస్టు 31న మెహెరాజాద్‌కు వెళ్ళాం. సాధారణంగా మెహెరాజాద్‌లో

మధ్యాహ్నం 12 తర్వాత ఎవరినీ అనుమతించరు. కానీ మాకా నియమం లేదు.
మెహెరాజాద్‌లో ఆ రోజు సాయంత్రం దాకా గడిపేందుకు అనుమతించారు.
మెహెర్‌బాబా మనోనాశ్ నిర్వహించిన తింబి కొండ ఎక్కాం.
అక్కడ ప్రార్థనలు ఆరతి ఇచ్చాం. అనంతరం, బాబా మండలిహాలు, బ్లూ బస్, బాబా డిస్పెన్సరీలను పరిశుభ్రం చేసి, ఎక్కడి వస్తువులు అక్కడ అమర్చే పనిని మాకు అప్పగించారు.
బాబా వాడిన అనేక వస్తువులను దూరం నుండి గాజు బీరువాల్లోంచి దర్శించుకునే వీలుంటుంది. కానీ, ఈ సహవాస్‌లో పాల్గొన్న భాగ్యంగా, బాబా వాడిన అనేక వస్తువులు, ఆయన నడియాడిన అనేక ప్రదేశాలను మా చేతులతో పరిశుభ్రం చేయగల ఒక అరుదైన అవకాశం మాకు లభించింది.
మామూలు రోజుల్లోనైతే మాకీ భాగ్యం దొరికుండదు కదా!!
ఇదొక రకమైన ఆనందమయ అనుభూతి!!
సెప్టెంబరు ఒకటవ తేదీ. మా సహవాస్ చివరి రోజు.
బాబా ట్రస్టు సభ్యులు జాల్ దస్తూర్ మా అందరికీ ఐస్‌క్రీం పార్టీ ఇచ్చారు.
ఈ సహవాస్‌లో 7 రోజులపాటు పాల్గొన్న మాకు
ఒక అనిర్వచనీయమైన ఆనందమయ అనుభూతి లభించింది.
అది మాటల్లో అభివర్ణించలేని ఆనందం.
ఆ అవకాశం కల్పించిన బాబాకు కోటి కోటి ధన్యవాదాలు తెలుపుకుంటూ బరువెక్కిన హృదయాలతో ఎవరి ఊళ్ళకు వాళ్ళం సెప్టెంబరు 1న తిరుగు ప్రయాణమయ్యాం.
తిరిగి 2014లో నిర్వహించే **మెహెరాబాద్ యువ సమ్మేళనంలో** పాల్గొనే దాకా **మాకు ఆ తీపి గుర్తులు'** జ్ఞాపకముండిపోతాయి.
బాబా సేవలో ఈ దఫా మీరూ పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం!! ఈ సహవాస్‌పై మరింత సమాచారాన్ని మీకేమైనా కావాలంటే మాలో ఎవరినైనా పలకరించండి. స్థలాభావం వల్ల ఇంకా అనేక విశేషాలు వ్రాయలేకపోయాం. బోల్డన్ని విషయాలు, సరదా సరదా కబుర్లు చెప్పుకుందాం. కాదంటే ఓ పని చేయండి. మెహెర్ శాన్డిల్యకు **meher1005@gmail.com** మెయిల్ చేయండి. **ఇక ఉంటాం...**
**ఇట్లు, విజయవాడ నుండి**...బి. మెహెర్ శాన్డిల్య, మెహెర్ ఉమా సుప్రజ.
**హైదరాబాద్ నుండి**...ఆర్. మెహెర్ విజేత, పిడుగు మెహెర్ చంద్ర, బి. మెహెర్ కిరణ్, బి. మెహెర్ మాధురి, మెహెర్ స్వప్న, మెహెర్ శ్యామ్, రేఖా సింగ్, సోమనాథ్, ఆదిత్య.
**జైబాబా...,**

# The Highest of the High

# ఉన్నతోన్నతుడు

**తెలుగు సేత**

**–దిభాష్యం వెంకట సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం**

సెప్టెంబరు 7, 1953. ఆ రోజు ప్రధమ అవతార పురుషుడైన "జొరాష్టర్" జన్మదినం. మెహెర్‌బాబా 'డెహ్రాడూన్'లో ఉన్నారు. ఇంతలో కొంతమంది వ్యక్తులు ఒక కారులో మతి స్థిమితంలేని ఒక స్త్రీని తీసుకు వచ్చి, బాబా కాళ్ళవద్ద పడవేసి, బాబా, నీవు దేవుడవు కదా, ఈ స్త్రీని బాగుచేసి, తిరిగి ఈమెను మామూలుగా చెయ్యవలసిందిగా ప్రార్థించారు. బాబా వెంటనే ఆ స్త్రీని ప్రక్కన కూర్చుండబెట్టుకొని, అనునయించి, వచ్చిన వ్యక్తులకు ధైర్యం కలుగజేసి, వారిని తిరిగి పంపించారు. ఈ సంఘటన తర్వాత బాబా, పూర్తిగా గంభీరంగా మారి, ఉన్నతోన్నతుడయిన తనను, ఈ భౌతికమైన రుగ్మతల నుండి కాపాడమని ప్రజలు కోరడం పట్ల కలత చెంది, ఆ రోజున బాబా ఈ క్రింది ప్రకటన చేశారు. అదే "ఉన్నతోన్నతుడు" (The Highest of the High). ఇది మెహెర్‌బాబావారి సందేశములలో కెల్ల ఉన్నతమైనది. ఇంగ్లీషులో వున్న ఈ సందేశాన్ని దిభాష్యం వెంకట సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం తేటతెనుగులో అనువదించారు. బాబావారి ఈ సందేశాన్ని ఇప్పటికే ఎందరో తెలుగులో అనువదించినా దిభాష్యం వారి అనువాదానికి ఓ ప్రత్యేకత ఉందని చెబుతూ మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా ఆయన ఏకలవ్య శిష్యుడు శ్రీ ఆచంట ఫణి, మార్టేరు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రచురణార్థం పంపారు.

**దయచేసి పరిశీలించి, స్పందించగలరు....ఎడిటర్.**

---

**ఎఱుకతో గాని, ఎఱుక లేకుండా గాని, ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని,** ప్రతి జీవరాశి, ప్రతి మానవుడు తన వ్యక్తిత్వాన్ని ప్రకటించుకోవడానికి కృషి చేస్తూనే ఉంటాడు. కాని, చివరలో మానవుడు తాను అనంతుడననీ, అవిభాజ్యుడననీ అనుభూతి పొందినప్పుడు మాత్రమే భగవంతునిగా తన వ్యక్తిత్వం యొక్క ఎఱుకను పూర్తిగా అతడు పొందుతాడు. ఆ విధంగా అనంతమైన శక్తి జ్ఞానానందాలను అనుభవిస్తాడు. ఈ విధంగా మానవుడు భగవంతుడై **"సద్గురువు"** లేక **"కుతుబ్"** గా గుర్తింపబడతాడు. ఈ మానవుని ఆరాధించడం భగవంతుని ఆరాధించడమే. భగవంతుడు మానవ రూపంలో వ్యక్తమై, మానవాళికి తన

దివ్యత్వాన్ని ప్రదర్శించినప్పుడు, ఆయన అవతారునిగా–మెస్సయ్యగా, ప్రవక్తగా గుర్తింపబడతాడు. ఈ విధంగా భగవంతుడు మానవుడౌతాడు.

అందుచేత, అనంతుడైన భగవంతుడు అన్ని కాలాలలోను, యుగయుగాలుగా, అనంతమైన తన కారుణ్యంతో, మానవరూపంలో మానవస్థాయికి దిగివచ్చి, మానవుల మధ్య ఆవిర్భవిస్తూ ఉంటాడు. కాని, మానవుల మధ్య ఆయన కూడా ఏ యితర ప్రాపంచిక వ్యక్తి మాదిరిగానే చూడబడతాడు. కానయితే, తాను యుగావతారుడనని ప్రకటించడం ద్వారా ఆయన భూమిపై తన దివ్యత్వాన్ని ధృవపరచినప్పుడు మాత్రం ఆయనను భగవంతునిగా అంగీకరించిన కొద్దిమంది ఆయనను ఆరాధిస్తారు.

భూమిపై ఆవిర్భవించిన భగవానునిగా ఆయనను తెలిసికొన్న బహు కొద్దిమంది ఆయనను స్తుతిస్తారు. కాని, ఆయన భౌతికంగా తమ మధ్య ఉన్నప్పుడు తప్పనిసరిగా ఆయనను నిరాకరించడం మిగతా మానవులందరి వంతు అవుతుంది.

మానవాళి యెడల తనకు గల అనంతమైన ప్రేమ మూలంగా వారి నిమిత్తమై మానవ స్థాయికి దిగి వచ్చి, మానవ రూపంలో తనను అవతారునిగా ప్రకటించుకొన్న భగవంతుడు, ఆ మానవుల చేతనే నేరారోపణ గావింపబడి, చిత్రహింస గావింపబడడమేకాక, అవమానింపబడి, నిరాకరింప బడతాడు. ఈ విధంగా అవతారుని రూపంలో భగవంతుని వ్యక్తీకరణను నిరాకరించడంలోనే కనీసం పరోక్షంగానైనా వారు అనంత శాశ్వత స్థితిలో భగవంతుని అస్తిత్వాన్ని నిర్ధారిస్తున్నారు కనుక అవతారుడు ఆ చిత్రహింసనంతా భరిస్తాడు.

మానవ రూపంలో అవతారునిగా, "మెస్సయ్య"గా, ప్రవక్తగా, సనాతన పురుషునిగా, ఉన్నతోన్నతునిగా తనను తాను వ్యక్తపరచుకొనే ఏకైక, అనంత, శాశ్వత, అవిభాజ్యుడైన భగవంతుడు ఎప్పుడూ ఒక్కడే. కనుక అవతారుడు కూడా ఎప్పుడూ ఒక్కడే. మానవాళిని అజ్ఞానగర్తాన్నుండి లేవనెత్తడానికీ, భ్రమాన్వితమైన బంధనాల నుండి వారిని విముక్తులను చేయడానికీ, ఈ ఒకే అవతారుడు శాశ్వతంగా విభిన్నకాలాలలో, విభిన్నమైన మానవ రూపాలను, నామాలను ధరించి, విభిన్న ప్రాంతాలలో, సత్యాన్ని విభిన్న విధాలుగా విభిన్నమైన భాషలలో విశదీకరించడానికి మరల మరల అవతరిస్తూ ఉంటాడు.

అవతారునిగా వ్యక్తమైన భగవంతుని రూపాలలో అత్యధికంగా గుర్తింపబడి, మిక్కిలిగా ఆరాధింపబడే వాటిలో రామ, కృష్ణ, బుద్ధ, జీసస్, ముహమ్మద్‌ల కంటే ముందున్న కారణంగా "జొరాష్టరుని" అవతరణ అతి ప్రాచీనమైనది. ఆయన వేలాది సంవత్సరాలకు పూర్వమే సత్యసారాన్ని "మంచి తలపులు, మంచి మాటలు, మంచి చేతలు" అనే మూడు ప్రాథమికమైన ఆదేశాల రూపంలో ప్రపంచానికి అందించారు. అంతుతెలియని రీతిలో మానవాళిని సత్యంవైపు నడిపించడంలో ప్రతికాలంలోను అవతారునిచేత ఈ ఆదేశాలే ప్రత్యక్షంగానో, ఏదో ఒక రూపంలో నిరంతరంగా విప్పి చెప్పబడుతూనే ఉన్నాయి. ఎప్పటికీ విప్పి చెప్పబడుతూనే ఉంటాయి. "మంచి తలపులు, మంచి మాటలు, మంచి చేతలు" అనే ఈ

నియమాలను ఆచరణలో పెట్టడం అసాధ్యం కాకపోయినా, అనిపించేటంత సులభ సాధ్యం కాదు. కాని, ఈ నియమాల ప్రకారం తు.చ. తప్పకుండా నిజాయితీతో జీవించడం, జీవిస్తూ జీవన్మరణాన్ని అభ్యసించడం ఎంత అసాధ్యమో అంత అసాధ్యం.

నిజమైన వారి సంఖ్య స్వల్పమే కావచ్చు గాక, కాని, ప్రపంచంలో అసంఖ్యాకులైన సాధువులు, మహాత్ములు, మహా పురుషులు, యోగులు, "వలీ"లు ఉన్నారు. ఆ కొద్దిమంది నిజమైన వారు, తమ తమ ఆధ్యాత్మిక స్థాయిలననుసరించి, సాధారణ మానవుల స్థాయికీ, ఉన్నతోన్నతుని స్థాయికీ కూడా చెందని ఏదో కోవకు చెందుతారు.

నేను మహాత్ముడను కాను, మహా పురుషుడను కాను, సాధువును కాను, సన్యాసిని కాను, యోగిని కాను, "వలీ"ని కాను. భోగభాగ్యాలను పొందాలని కాని, తమకున్నవాటిని నిలుపుకోవాలని కాని, కోరికతో నన్ను ఆశ్రయించేవారికీ, బాధ నుండి, నిరాశ నుండి నా ద్వారా ఉపశమనాన్ని కోరే వారికి, ప్రాపంచికమైన కోరికల సాఫల్యానికీ, సంతృప్తికీ నా సహాయాన్ని అర్థించేవారికి – వీరందరికీ నేను మరొక్కసారి నొక్కి చెప్పేదేమంటే, నేను సాదువును కాని, సన్యాసిని కాని, మహాత్ముడను కాని, మహాపురుషుడను కాని, యోగిని కాని కానందువలన, వీటన్నిటినీ నా ద్వారా ఆశించడం, పరిపూర్ణమైన నిరాశను ఆహ్వానించడమేనని. అయితే, ఈ నిరాశ పైకి కనపడేది మాత్రమే. ఎందుచేతనంటే, ప్రాపంచికమైన కోరికలను సంపూర్ణంగా మార్పు చెందించే ఉపకరణంగా ఈ నిరాశే చివరకు తప్పనిసరిగా పనిచేస్తుంది కనుక.

మధ్య స్థితిలో నున్న సాధువులు, యోగులు, "వలీ"లు ఇంకా ఇతరులు, అద్భుతాలను ప్రదర్శించి, సహాయం కొఱకు, ఉపశాంతి కొఱకు తమ వద్దకు వచ్చే వ్యక్తుల క్షణికమైన భౌతిక అవసరాలను సంతృప్తి పరచగలరు, సంతృప్తి పరుస్తున్నారు కూడా.

నేను సాధువును కానట్లయితే, సన్యాసిని కానట్లయితే, యోగిని కానట్లయితే, మహా పురుషుడను కానట్లయితే, వలీని కానట్లయితే, మరి "నేనెవరు?" అనే ప్రశ్న సహజంగా ఉద్భవిస్తుంది. అయితే నేను సాధారణ మానవుడనైనా కావాలి లేదా ఉన్నతోన్నతుడనైనా కావాలి అన్నది సహజంగా ఊహకందే సమాధానం.

కాని, ఒక్క విషయం మాత్రం నేను కచ్చితంగా చెబుతున్నాను. అదేమిటంటే, మధ్యస్థితి గల (నిజమైన) సాధువులు, సన్యాసులు, యోగులు మొదలైన వారిలో నేనెన్నడూ చేర్చబడజాలనని.

నేను కేవలం సాధారణ మానవుడనే అయినట్లయితే, నా సామర్థ్యాలు, శక్తులు పరిమితమైనవే అయి ఉంటాయి. సాధారణ మానవుని కంటే నేను గొప్ప వాడనూ కాదు, వేరూ కాదు. అందుచేత, ప్రజలు నన్నావిధంగా భావించినట్లయితే, వారు నా నుండి అద్భుతాల రూపంలో కాని ఆధ్యాత్మిక పర్యవేక్షణ (సహాయం) రూపంలో కాని, అసాధారణమైన సహాయాన్నేమీ ఆశించ కూడదు. తమ కోరికలను తీర్చమని నన్ను ఆశ్రయించడం కూడా

అప్పుడు అర్థరహితమే అవుతుంది.

అలా కాకుండా, నేను సాధారణ మానవుని స్థాయికి అతీతంగా ఉండి, సాధువులు, యోగుల స్థితి కంటే ఇంకా అతీతంగా ఉన్నట్లయితే, నేను ఉన్నతోన్నతుడను అయి తీరాలి. అలా అయిన పక్షంలో, మీ మానవ మేధతోను, పరిమిత మనసుతోను, నా స్థితిని తెలుసుకోవడానికి ప్రయత్నించడం, ప్రాపంచికమైన కోరికలతో నన్ను ఆశ్రయించడం, మూర్ఖత్వమే కాక శుద్ధ అజ్ఞానం కూడా. ఎందుచేతనంటే, ఎంతటి మేధావంతమైన ప్రయత్నమైనా సరే, నా విధానాలను ఎన్నటికీ అర్థం చేసుకోలేదు. నా అనంత స్థితిని నిర్ణయించలేదు.

నేను ఉన్నతోన్నతుడనే అయినట్లయితే, నా నిర్ణయమే శాసన మౌతుంది. నా ఇచ్ఛయే ఆ శాసనాన్ని నడిపిస్తుంది. నా ప్రేమయే విశ్వానికి ఆధారభూతమౌతుంది. పైకి కనపడే మీ కష్టాలు, క్షణభంగురమైన బాధలు, అన్నీ కూడా చివరకు మంచి చేయడం కోసం నా ప్రేమ మూలంగా ఉత్పన్నమైనవే. అందుచేత, మీమీ బాధల నుండి తప్పించడం నిమిత్తమైన నన్ను ఆశ్రయించడం, మీ ప్రాపంచికమైన కోరికలను నేను సంతృప్తి పరచగలనని ఆశించడం, అసాధ్యమైన దానిని నన్ను చేయమనడం అవుతుంది. నేను ఇంతకుముందే విధించిన దానిని ఉపసంహరించుకోమనడమే అవుతుంది.

మీరు యథార్థంగాను, పూర్తి విశ్వాసంతోను, మీ "బాబా"ను "ఉన్నతోన్నతునిగా" స్వీకరించి నట్లయితే, మీ కోరికల సంతృప్తి కోసం ఆక్రోశించడం కాక, మీ జీవితాన్ని ఆయన పాదాల చెంత సమర్పించడమే మీకు తగి ఉంటుంది. ఉన్నతోన్నతుడైన బాబా వంటివాని పాదాల చెంత మీ ఒక్క జన్మ కాదు, కోట్లాది జన్మలను అర్పించినా, అతి స్వల్పమైన త్యాగం మాత్రమే అవుతుంది. ఎందుచేతనంటే, మీ అశాశ్వత జీవనంలోని అసంఖ్యాకమైన అంధ మార్గాలు గుండా మిమ్ములను సురక్షితంగా నడిపించగల కచ్చితమైన తిరుగులేని సహాయకారి బాబా యొక్క అపరిమితమైన ప్రేమ మాత్రమే.

తాము ఏదో ఒకనాడు విడిచిపెట్టి తీరవలసిన తమ సర్వస్వాన్నీ (తనువు, మనస్సు, సంపాదించుకొన్న సర్వస్వం) నాకు సమర్పించేవారు ఏదైనా ఉద్దేశ్యాన్ని పెట్టుకొని సమర్పించినట్లయితే – ఎన్నడూ తరగని అనంతానందమనే సంపదను పొందాలంటే, ప్రాపంచికమైన వస్తువులను విడచి పెట్టియే తీరాలని అవగాహన చేసుకున్నందు వలన తమ సర్వస్వాన్నీ నాకు సమర్పించేటట్లైతే–వారి యెడల నాకు ఏవిధమైన మొగమాటము ఉండదు. అత్యున్నతమైన సంపాదన యెడల గల కోరిక ఈ సమర్పణను పట్టుకొని వ్రేలాడుతున్నందువలన ఆ సమర్పణ సంపూర్ణం కానేరదు.

నేను ఉన్నతోన్నతుడనే అయినట్లయితే, మీ కోరికలను తీర్చడం కంటే, మీకున్న సమస్తాన్నీ, మీ కోరికలను పూర్తిగా ఊడ్చివేసి, మీ కోరికల నన్నిటిని దహించివైచి, మిమ్ములను కోరికలు లేనివారిగా చేయడమే నాకు పాత్రోచితంగా ఉంటుంది. సాధువులు, సన్యాసులు, యోగులు,

"వలీ"లు, మీరేది కోరితే దానిని ఇవ్వగలరు. కాని, నేను మీ కోరికల నన్నింటిని తీసివేసి, మిమ్ములను బంధనాల నుండి విముక్తులను చేసి, అజ్ఞాన బంధాల నుండి విముక్తులను చేస్తాను. నేను తీసుకొనేవాడనే గాని, మీరు కోరిన వాటిని, మీరు కోరిన విధంగా యిచ్చేవాడను కాను. మేధావులు తమ మేధస్సు ద్వారా నన్నెన్నటికీ అర్థం చేసుకోలేరు. నేను ఉన్నతోన్నతుడనే అయినట్లయితే, మేధస్సుతో నన్ను కొలవడం, పరిమిత మానవ మనస్సుతో నా విధానాల అంతు తెలుసుకోవడం, అసాధ్యమౌతుంది.

నన్ను ప్రేమిస్తూ నా యెడల తీవ్రమైన ఆరాధనా భావంతో భక్తిశ్రద్ధలు కనబరచే వారి కోసం కాదు నేను. నన్ను కించపరచి జుగుప్సతో నా వైపు వ్రేతెత్తి చూపేవారి కోసం కూడా కాదు నేను.

నా చుట్టూ కోట్లాది ప్రజలు గుమ్మిగూడటం కోసం కాదు నేనున్నది. గుంపులో చెల్లాచెదురై, మౌనంగాను, నిరాడంబరంగాను, తమ సర్వస్వాన్ని-తనువు, మనస్సు, తాము సంపాదించుకొన్న సర్వస్వాన్నీ నాకు సమర్పణ చేసుకున్న కొద్దిమంది ఎన్నుకోబడిన వారి కొరకు నేను. ఇంకా తమ సర్వస్వాన్నీ సమర్పణ చేసి కూడా,

ఆ సమర్పణ గురించి చిన్నమెత్తు ఆలోచన కూడా ఎన్నడూ చేయని వారి నిమిత్తమే నేను. తమ పరిత్యాగాన్ని గురించిన తలపును కూడా పరిత్యజించడానికి సంసిద్ధులైన వారు నా కనుసన్నతో తమ జీవితాలను సత్యం నిమిత్తమై అర్పించి వేయడానికి తమ వంతు కోసమై తీవ్రమైన కార్యక్రమం మధ్య కూడా నిరంతరమైన అప్రమత్తతతో వేచిచూస్తూ ఉంటారో, వారందరూ నా వారే. నికృష్టమైన కష్టాలను కూడా యిష్టంగాను, ఆనందంగాను ఎదుర్కొన గల అజేయమైన ధైర్యం కలవారు, నా యందు అచంచలమైన విశ్వాసం కలిగి ఉండి తమ సౌఖ్యాన్ని, సౌకర్యాలను త్యాగం చేసయినా, నా యొక్క అతి చిన్న ఇచ్ఛను సైతం నెరవేర్చడానికి ఆత్రపడేవారు-వీరే నన్ను యాదార్థంగా ప్రేమించేవారు.

తనను గొప్ప భగవద్భక్తునిగా భావిస్తూ కూడా, దైవీన్యాయం ప్రకారం తనకు కేటాయింప బడిన బాధ్యతను విస్మరించి, చిట్టచివరలో తనకు శాశ్వత విముక్తుని ప్రసాదించడానికే ఉద్దేశింపబడిన కష్టాల నుండి ఉపశాంతి నిమిత్తమై సాధువులు, సాన్యాసులు, యోగులు వెంటపడే వ్యక్తి కంటే, తన ప్రాపంచిక బాధ్యతలను గౌరవమైన తన ధర్మంగా అంగీకరించి, వాటిని విశ్వాసంతో నెరవేర్చే నాస్తికుడే నా దృష్టిలో ఎక్కువ అదృష్టవంతుడు.

సమ్మోహనకరమైన శారీరక భోగాలపై ఒక కంటిని నిలిపి, వేరొక కంటితో శాశ్వతానందలేశాన్ని చూడగోరడం అసంభవమే కాక, అత్యున్నతమైన కపటం కూడా.

మీరేదైతే తెలుసుకోవాలని నేను భావిస్తున్నానో, దానినంతటినీ మీరు ఒకేసారి అర్థం చేసుకోవాలని నేను ఆశించలేను. మాటిమాటికీ మిమ్ములను మేలుకొలిపి, మీ పరిమిత మనస్సులలో (ప్రేమ) బీజాలను నాటడమే యుగయుగాలుగా నా పని.

అవి కాలక్రమేణా, మీరు తీసుకొనే శ్రద్ధను, జాగ్రత్తను బట్టి, మొలకెత్తి, పుష్పించి,

మీరు పొందడానికి నిర్దేశింపబడి ఉన్న యధార్ధ జ్ఞానమనే ఫలాన్ని ప్రసాదిస్తుంది.

ఆ విధంగా కాక, మీ అజ్ఞాన ప్రేరితులై, మీరు నడచే త్రోవనే పోతామని మీరు పట్టు పట్టినట్లయితే, మీ రెన్నుకున్న ఆ అభివృద్ధి మార్గంలో మిమ్ములనెవ్వరూ ఆపలేరు.

ఆ మార్గం కూడా, ఎంత నెమ్మదిగాను, బాధాకరంగానయినా, అసంఖ్యాకమైన పునర్జన్మల తరువాత, మీరు దేనినైతే యిప్పుడే తెలుసుకోవాలని కోరుతున్నారో, ఆ అనుభూతిని ప్రసాదించగలదు, కనుక అది కూడా పురోగమనమే. యధార్ధమైన గమ్యాన్ని గురించిన మీ అజ్ఞానం యొక్క పరిమితిని బట్టి మీకు మీరు సృష్టించుకొనే బాధలలోను, భ్రాంతి వలయంలోను, మరింతగా చిక్కుకోకుండా కాపాడుకొనడానికి గాను ఇప్పుడే మేలుకోండి. మీతోను, భగవంతుని యెడల నిజాయితీతో మెలగండి. ఎవరైనా సరే, తన పొరుగువారిని, ప్రపంచాన్ని మోసగించగలరేమో కాని, సర్వజ్ఞుడైన వాని జ్ఞానం నుంచి మాత్రం తప్పించు కోలేరు. దైవీన్యాయం అటువంటిది.

నాచెంత చేరిన మీరు నన్ను ఉన్నతోన్నతునిగా అంగీకరించి నన్ను ఆశ్రయించగోరేవారు, భోగభాగ్యాల కోసమూ, ప్రాపంచిక వస్తు సముపార్జన కోసమూ ఆక్రోశించే కోరికను హృదయంలో నిలుపుకొని ఎప్పుడూ నా వద్దకు రారాదనీ, మీ తనువు, మనస్సు, మీరు సముపార్జించుకొన్న సర్వస్వమూ, వాటి అనుబంధాలన్నిటితో పాటుగా నాకు సమర్పించాలనే తీవ్రమైన తహ తహతో మాత్రమే నా వద్దకు రావాలనీ పునరుద్ఘాటిస్తున్నాను.

మీ దుర్దశ నుండి విడిపించడానికి నన్ను అన్వేషించక, నా ఇచ్ఛకు హృదయపూర్వకంగా అర్పణ కావడానికే నన్ను పొందండి. ప్రాపంచికమైన ఆనందం కోసం, క్షణిక సౌఖ్యాల కోసం నన్ను పట్టుకొని వ్రేలాడక, మీ ఆనందాన్ని, సౌఖ్యాలను, నా పాదాల చెంత త్యాగం చేసి, కష్టసుఖాలలో నన్ను అంటి పెట్టుకొని ఉండండి. నా ఆనందమే మీ హాయిగా, నా సౌకర్యమే మీ విశ్రాంతిగా ఉండనీయండి.

మీకు చక్కని ఉద్యోగం యిప్పించమని నన్ను అడగడంగాక, నన్ను మరింత శ్రద్ధగాను, చిత్తశుద్ధితోను సేవించాలని కోరుకోండి! మీ జీవితాలను, మీకు ప్రియమైనవారి జీవితాలను రక్షించమని నన్ను యాచించడం కాక, మిమ్ములను స్వీకరించి, నా కొరకై మీ జీవితాలను అర్పించడానికి అనుమతించమని నన్ను యాచించండి. మీ శారీరక రుగ్మతలను నేను నయం చేయగలనని ఎన్నడూ ఆశించక, మీ అజ్ఞానం నుంచి విముక్తులను చేయమని నన్ను వేడుకోండి! నా నుంచి ఏదైనా స్వీకరించడానికి చేతులు చాచడం కాక, ఉన్నతోన్నతునిగా ఆశ్రయించిన నన్ను చేతులెత్తి స్తుతించండి.

నేను సర్వోన్నతుడనే అయినట్లయితే, నాకు అసాధ్యమైన దేదీ ఉండదు. వ్యక్తిగత అవసరాలను తీర్చే నిమిత్తం నేను అద్భుతాలను ప్రదర్శించకపోయినా (ఆవిధంగా సంతృప్తి పరచడం, ఆ వ్యక్తిని మరింతగా ప్రాపంచికమైన బంధనాలలో చిక్కుకొనేటట్లు చేయడమే). అప్పుడప్పుడు నా అనంతశక్తిని అద్భుతాల రూపాలలో ప్రదర్శిస్తూ ఉంటాను. కాని, అది సమస్త

జీవరాశుల యొక్క, సర్వమానవాళి యొక్క ఆధ్యాత్మికోన్నతి, ప్రయోజనాల నిమిత్తమే. అయినా, నన్ను ప్రేమిస్తూ నా యందు అచంచలమైన విశ్వాసం గల వ్యక్తులకు అప్పుడప్పుడు అద్భుతమైన అనుభవాలు కలిగాయి. వాటిని తమపైగల నా కృపా దృష్టి-నజర్-కు అంటగట్టడం జరిగింది. కాని, ఆ విధమైన వ్యక్తిగత అద్భుత అనుభవాలను నా ఉన్నతోన్నత స్థితికి అంటగట్టడం నా ప్రేమికులకు ఉచితమైన పని కాదని మీరందరు తెలిసికోవలసినదిగా కోరుతున్నాను. నేను ఉన్నతోన్నతుడనే అయినట్లయితే, దైవీప్రణాళికలో, భ్రాంతియుతమైన ఈ మాయా నాటకాలన్నిటికీ నేను అతీతంగా ఉంటాను.

అందువలన, నన్ను ఉన్నతోన్నతునిగా గుర్తించిన నా ప్రేమికులకు గాని, తమకు తెలియకుండా ఇతర మార్గాల ద్వారా నన్ను ప్రేమించే తదితరులెవరికైనా గాని ఏ విధమైన అద్భుత అనుభవాలైనా కలిగినట్లయితే, అవి వారికి నాయందు గల దృఢ విశ్వాసం మూలంగానే. అచంచలమయిన వారి విశ్వాసం అప్పుడప్పుడు మాయా శక్తిని అధిగమించి, అద్భుతాలనబడే అనుభవాలను వారికి ఇస్తుంది.

ఆ విధంగా దృఢ విశ్వాసం మూలంగా పొందబడే అనుభవాలు ఆ వ్యక్తులను మరింత ఎక్కువగా మాయా బంధనాలలో చిక్కుకొనేటట్లు చేయక, వారికి చివరకు మంచినే కలిగిస్తాయి.

నేను ఉన్నతోన్నతుడనే అయినట్లయితే తృటి మాత్రంలో ప్రతి ఒక్కరికి భగవత్ సాక్షాత్కారాన్ని ప్రసాదించి సృష్టిలోని ప్రతి ప్రాణిని అజ్ఞాన బంధనాల నుండి విడుదల చేయడానికి నా విశ్వాత్మక న్యాయం యొక్క చిన్న ఇచ్ఛ చాలు కాని దైవీ న్యాయానుగుణంగా అజ్ఞానానుభవం ద్వారా పొందబడే జ్ఞానమే ధన్యమయినది. సద్గురువుల దర్శకత్వము చేతను, ఉన్నతోన్నతునికి సర్వార్పణ చేసుకోవడం ద్వారాను ఈ జ్ఞానం మీకు అజ్ఞాన మధ్యంలోనే అందుబాటులోకి తేబడుతుంది.



# సంస్మరణ

ధవళేశ్వరం (తూర్పుగోదావరి జిల్లా) వాస్తవ్యులు శ్రీమతి యడ్ల వెంకటరమణమ్మగారు (73) 18.09.2013 బుధవారం బాబా స్మరణలో దేహం విడచినారు.

# ఎర్రని చిరునామాలు

మెహెర్‌బాబా పత్రికకు గత రెండు మూడేళ్ళకు పైగా పత్రిక వార్షిక సభ్యత్వం చెల్లించనివారికి గుర్తుచేసేలా పత్రిక కాగితం కవరుపై ఎర్రని చిరునామాలు అతికించి పంపాం. స్పందన తెలపని ఎర్రని చిరునామాలన్నింటినీ 2013 అక్టోబరు సంచిక నుండి తొలగించడమైందని గమనించగలరు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు, నీవు
పరబ్రహ్మవు,పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్చానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2013 సెప్టెంబరు - అక్టోబరు నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01 | అక్టోబరు | వై. ఝాన్సీ, ఖమ్మం | రూ. 500.00 |
| 02 | అక్టోబరు | ఎస్. శ్రీధర్, నిజామాబాద్ | రూ. 500.00 |
| 03 | అక్టోబరు | అక్కినపల్లి రాజయ్య, బేరిపురి, కరీంనగర్ జిల్లా | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 2000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

## మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
**యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218, 040-27860079**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310,
Postal Concession: R&D/RNP/HSE/789/2012-2013
**Dt.19-12-2011**